


# శ్రీ సాయి దర్శన్


సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక

సంపుటి-7 | జూలై - 2008 | సంచిక 8


శ్లో॥ న మే పార్థాస్తి కర్తవ్యం
త్రిషు లోకేషు కించన ।
నానవాప్తమవాప్తవ్యం
వర్త ఏవ చ కర్మణి ॥ 22 ॥

(భ.గీ.3 - 22)

తా॥ ఓ అర్జునా ! ఈ ముల్లోకముల యందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో ఏదియును నేను పొందనిదియును లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను.


## SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*

Editor : **Raojee**

Associated Editor : **A. Lakshmi**

**Subscription Rates**

Maharaja Poshakulu Rs.1,501-00
Life Membership (20 Yrs) Rs.751-00
For 3 Years Rs.275-00
For 1 Year Rs.100-00

M.O's / DD's may be drawn in favour of



**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in

# విషయసూచిక


సంపాదకీయం........3
సాయిస్తుతి........4
శ్రీగురుపౌర్ణమి........5
సాయిపథం........11
గురుకృపయే గురుపూర్ణిమ........12
మార్గదర్శకుడు గురువే........17
గురుప్రాధాన్యం........20
సాయిచరిత్రలో మరపురాని మరో మధురదినం........22
బాలాసాహెబ్ బాటే........26
శ్రీసాయిచూపిన సాధనమార్గం -మనం మర్చిపోతున్నామా?........28
గుప్తదానం........35
శ్రీసాయినాథ భజనమాల........36
భక్తియోగము........42
గురూపదేశం........46
పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ........49
సాయినాథ ఉవాచ........52
సద్గురువుపై విశ్వాసం........58
శ్రీసాయిబాబా జన్మరహస్యం........59
సద్గురువు ప్రభావం........61
శ్రీలలితా సహస్రనామములు........62
దాసానుదాసుడు - హరిదాసుడు........64
ప్రార్థనా కుసుమాలు........70
ఆధ్యాత్మిక సంపద........72
ధ్యానం........74
ఊధిమహిమ........77
లేఖలు........79




శ్రీసాయినాథాయనమః

# గురుపూర్ణిమ

గురుపూర్ణిమనే 'వ్యాసపూర్ణిమ' అని కూడా అంటారు. ఇది అనాదికాలంనుండి ఆషాఢమాసంలో వచ్చే అతి ప్రధానమైన పండుగ. పంచమవేదమని పిలువబడే భారతాన్ని, భాగవతాన్ని రచించిన వ్యాసభగవానుని ఆరాధించే పవిత్రమైన రోజిది. విష్ణు సహస్రనామంలో వ్యాసమహామునిని, 'విష్ణురూపాయ' అని శ్రీమహావిష్ణువే వ్యాసరూపుడనియు వర్ణించబడింది.

షిర్డీలో జరిగే గురుపూజోత్సవం నాడు భక్తులు శ్రీసాయిబాబా పాదపద్మాలను స్పృశించి ఆరాధిస్తూ వారికి శాలువాలను,ధనాన్ని,ఫలాలను, ధాన్యంవంటి పదార్థాలను కానుకలుగా సమర్పించేవారు. గురుపూజ చేసిన భక్తులు (కూడా) వారి కోరికలను ప్రయోజనాలను నెరవేర్చుకొనేవారు. ప్రతి మత సంస్థ యథోచితరీతిని గురుపూజోత్సవము జరుపుకోవాలి. భక్తుడు తన కిష్ట(దైవ)మైన సద్గురువు నెంచుకొని వానిపై నిశ్చలమైన విశ్వాసము, గాఢభక్తి నుంచి ఈ జన్మలోనే పరమాత్మను పొందుటకు, శ్రీసాయి పేర్కొనిన సిద్ధాంతము (సూత్రాలను) ఆచరించవలెనని నా ప్రగాఢమైన ఆకాంక్ష. శ్రీసాయిబాబా భక్తులందరిపై తన అవ్యాజ కరుణామృతధారలను కురిపించుగాక ! - సదా సాయిసేవలో

# సాయిస్తుతి

**చీనిపల్లి రాజ్యలక్ష్మి,** విశ్రాంత ప్రధానోపాధ్యాయిని 17/461-సి1,
నెహ్రూనగర్, మదనపల్లి (చిత్తూరు జిల్లా) ఫోన్ : 517 325, ఆం.ప్ర.

1. జయము జయము షిరిడీశా జయము జయము సాయీశా
భయములు తొలగించి అభయమునిచ్చే శిలధిపురనివాసా
రయమున వచ్చి భక్తుల బ్రోచే, కరుణామయి సాయిశా
వైరిని సైతం కరుణతో గాచిన తరతమ భేదం ఎరుగని సర్వేశా ॥ జయము ॥

2. ఏకాగ్రతతో మనమున నిల్పి ముదముతో కొల్చిన కొంగుబంగారమే నీవు సాయీశా
ఆకలిదప్పుల వ్యాకులమే లేక కీకారణ్యయములోనినుగని ధన్యత చెందెను బాయీజా
వాకబుచేసిన భక్తుజనులకు అలవోకగా లీలలను చూపిన సద్గురు సాయీ ॥ జయము ॥

3. సాయినామమే సర్వదోషహరం సాయిరూపమే సర్వపాపహరం
సాయిబోధనలే సర్వత్రా ఆచరణీయం సాయిపలుకులే తేనెజల్లులు
సాయిగుణగానమే అభయప్రదానం సాయిసచ్చరిత్రే జీవనమార్గం
సాయిసందేశమే జగద్రక్ష సాయి చల్లని చూపులే శ్రీరామరక్ష ॥ జయము ॥



# శ్రీగురుపౌర్ణమి

యమ్. ఉమామహేశ్వరరావు, విశాఖపట్నం - 530 044



"అయ్యా ! మీ గురువెవరో సెలవిస్తారా ?"

"తప్పకుండా !"

**గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః**

అంటే ?...

అంటే ఏముంది? గురువే బ్రహ్మ, గురువే విష్ణుమూర్తి, గురువే ఆ మహేశ్వరుడు. గురువే సాక్షాత్తూ పరబ్రహ్మతో సమానం. ఇక చెప్పేదేముంది?

ఈ సకల చరాచర సృష్టిలో మనిషి జన్మ ఎంతో ఉత్తమమైంది. కాని ఈనాటి కాలంలో మనుష్యులు మనీషులుగ మారాల్సింది పోయి, బాహ్యమైన సుఖాలకై వెంపర్లాడుతూ, ధనంపట్ల విపరీతమైన వ్యామోహం పెంచుకుంటూ, జీవితం యొక్క విలువను పోగొట్టుకుంటు, చివరకు ఎవరికీ గాకుండ, ఏమీ గాకుండ ఆశాపాశాల్లో చిక్కుకుని, సుడిగాలిలో ఎండుటాకులా రాలిపోతున్నారు. సరైన మార్గదర్శి లేక, సరియగు జ్ఞానం అందించే సద్గురువును గానక శలభం లాగ కొట్టుమిట్టాడుతూ సుఖాలనే ఒయాశీస్సుల ఆకర్షణలో వాటిని

వెతుక్కుంటూ పోతున్నారు. చివరకు అనుకున్నది అందుకోలేక హతాశులై కుమిలిపోతున్నారు.

దీనికంతటికీ ఏది కారణమో... ఒక్కసారి మనం ఆలోచించినట్లయితే, మన ఈ సమాజంలో ఎందరో జ్ఞానులున్నారు. మహనీయులున్నారు. పూజ్యులైన వారున్నారు. కాని అటువంటి వారిని గురించి తెల్సుకుని, వారి పాదాలచెంత చేరి, వారి బోధనలు అనుసరించే తీరిక, ఓపిక ఈనాటి వారికి లేదన్నది జగమెరిగిన సత్యం.

తమకు గల అజ్ఞానాన్ని నశింపచేసుకోవాలంటే ముందుగా తమలో జ్ఞానదీపం వెలిగించే సద్గురువును ఆశ్రయించాలి. ఈ ప్రపంచంలో అన్నింటికన్న శాశ్వతమైనది గురువ్యవస్థేనని శ్రీషిరిడీ సాయినాథుడేనాడో వక్కాణించడం జరిగింది. 'గురుకృప' కన్నా మించిన దేముందీ లోకంలో అన్న ప్రశ్నకు జవాబెక్కడా దొరకదంటారాయన. ప్రతీ ఒక్కరూ త్రికరణశుద్ధిగా, సద్గురువు పాదాల చెంత చేరి ఆయన తత్త్వాన్ని అర్థం చేసుకుంటు, ఆయన చూపిన మార్గంలో నడిచిననాడు గురుకృప లభించడమే గాదు, అజ్ఞానం తొలగిపోయి, జ్ఞానం లభిస్తుంది.

గురువు తన శిష్యునిపై చూపించే ప్రేమ ఎటువంటిదో, శిష్యుడు ఆ గురువుపై చూపే భక్తి, విశ్వాసాలెటువంటివో 'జ్ఞానేశ్వరి' అనే గ్రంథాన్ని చదివితే తెలుస్తుంది అని శిర్డీ సాయి చెప్పడమే కాదు, తన చుట్టువున్న వారితో జ్ఞానేశ్వరిని చదవమంటు కోరడమూ జరిగింది.

ఇక ఈ గురుపౌర్ణమి అంటే ఏమిటో కాస్త పరిశీలనలోకి వెళ్తే... ప్రతీ సంవత్సరం వచ్చే ఆషాఢశుద్ధ పౌర్ణమినే 'గురుపౌర్ణమి' అంటారు. దీనికే



మారు పేరు కూడా వుంది. అది వ్యాసపూర్ణిమ. ఈ ఏడాది జూలై 18వ తేదీన ఈ శుభదినం రానేవచ్చింది. ఈ రోజు హైందవ సాంప్రదాయం ప్రకారం మన దేశంలో అసేతు హిమాచలం వరకూ గురుపూజోత్సవాలు జరుపుకుంటారు. వీటితో పాటు ఈ రోజుకు మరోవిశేషం కూడా వుంది. మునులలో శ్రేష్ఠుడు, మహాభారత గ్రంథ రచయిత, వేదాల్ని విభజించి, కాలాన్ని శాసించి, విశ్వ విశ్వంబరాలను నియంత్రణలో నుంచిన వేదవ్యాస మహర్షి యొక్క జన్మతిథి కూడ ఈ ఆషాఢశుద్ధ పౌర్ణమే. అందువలననే ఈ రోజును మానవచరిత్రలో భారతదేశసంస్కృతీ, సాంప్రదాయవైభవంలో మహాపుణ్యదినంగా పరిగణిస్తున్నాము.

సాక్షాత్తు ఆ వ్యాసభగవానుడే, ఈ రోజున అనగా తన జన్మదినం నాడు ఏ విధంగా పూజలు చేయాలో, వివరించినట్లు శాస్త్రాల్లో వుంది. తన జన్మదినం నాడు భక్తులు శ్రద్ధ, భక్తి, విశ్వాసాలతో నిష్ఠగా వుంటూ పూజలు చేసినట్లయితే స్వయంగా తానే వారికి ప్రత్యక్షమై వారి యొక్క కోరికలు తీరుస్తానని వ్యాసభగవానుడే చెప్పినట్లు తెలుస్తోంది. ఎవరైతే ఈ రోజున, గురుపూర్ణిమ గురించి, వ్యాసుని గురించి తెల్సిన ఓ మహాత్ముడిని పిలిచి, పూజించి, సత్కరించినట్లయితే ఆ యొక్క పూజ సత్ఫలితాన్నిస్తుందని, సర్వపాపాలను హరిస్తుందని వరమిచ్చేడు వేదవ్యాసుడు. ఇంతవరకూ గురుపౌర్ణమి గురించి భౌతికమైన దృష్టితో వివరణలతో చెప్పుకున్నాం. ఇక అంతర్లీనంగవున్న విశేష విషయాలు ఏమిటో పరిశీలిద్దాం...

'గురువు' అంటే మనలో వున్న అజ్ఞానపు చీకట్లను తొలగించేవాడని అర్థం. **నిజానికి, సాధకుడైన శిష్యునియొక్క శరీరంలోనే గురువున్నాడు.** అంటే

మానవ శరీరంలో నాడులన్నీ కలిసే చోట కేంద్రస్థానంగా పరమగురుస్థానం ఉంది. తలలోని మెదడు ఆలోచనలు అన్నింటికీ కేంద్రస్థానం, అయితే నిరంతరం ఆలోచనలతో, సతమత మౌతుండేది ఆ మెదడే. అటువంటి వేళలో నిద్ర మెలకువ యిదంతా ఏర్పడుతుంది. ఈ అసంకల్పిత చర్యకు కేంద్ర స్థానం గురుస్థానమే. ఒక్కోసారి మనిషి, అనేకమైన సమస్యల వలయంలో చిక్కుకుని ఆర్తితో ఆవేదనలతో కూనారిల్లుతూ చివరకు తనేమిటో, తన ఉనికేమిటో జ్ఞప్తికిరాని స్థితిలో తల్లడిల్లేవేళ అతన్ని ఆ అవస్థనుంచి బయటపడేసి మామూలు మనిషిని చేసేది ఈ గురుస్థానమే.

ఈ గురుస్థానాన్ని నిరంతరం వెలుగుతో నింపుతూ, మేల్కొనేటట్లు చేసేది సద్గురువు. ఆయన అనుగ్రహంతోనే మనిషికి తనను తాను తెలుసుకోగలుగుతున్నాడంటే గురువు యొక్క కృప, గురువు యొక్క శక్తి ఏటువంటిదో తెలుస్తుంది. ఈ స్థానం నుంచి నాలుగుపైగా నాడులు క్రిందకు దిగుతూ నాడీమండలంగా ఏర్పడి, అశ్వత్థవృక్షం మాదిరిగ తయారౌతుంది. తలక్రిందులుగా వున్నట్లుండే ఈ నాడీమండలమనే అశ్వత్థాన్ని శ్రీకృష్ణుడు తన పురుషోత్తమ ప్రాప్తియోగంలో యిలా అంటాడు.

"ఊర్ధ్వమూల మధశ్శాఖం అశ్వత్థం ప్రాహురవ్యయమ్
చందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ !!"

జీవితంలో కలిగే సుఖదుఃఖాలన్నింటికీ కారణాలైన శాఖల్లా మన జీవితంలో యిలా తలక్రిందులుగా వ్రేలాడే నాడులు కొమ్మలై మనల్ని కదిలిస్తున్నాయని భావించాలి.

మరి, మన శరీరంలో గురువు ఆశీనుడై వుండే ఆ పరమోత్కృష్టమైన



స్థానం ఏది? శిరస్సుపైన వుండే గురుస్థానం నుంచి, ఏర్పడి, ఎనిమిది దిక్కులకు కదిలే ఎనిమిది దళాలుగల పద్మమునే అష్టదళపద్మం అంటారు. దీనిపైనే సద్గురుడు ఆశీనుడై వుంటాడని అంతర్లీనంగ స్ఫురించు అర్థం. ఈ పద్మంలో ఆశీనుడై వున్న గురువు నుంచి వేలకొలదీ కాంతికిరణాలు, సృష్టిలోగల అందరి అనగా సమస్త జీవరాసుల శరీరాలన్నింటిలోను ప్రవేశిస్తాయి. అప్పుడే ఈ శిష్యుడికి అందరి ఆత్మలను సందర్శించే యోగ్యతా అన్నింటిలోనూ గురువు యొక్క దర్శన భాగ్యమూ కలుగుతుంది. ఇటువంటి వరం యివ్వగల శక్తి ఒక్క సమర్థుడైన సద్గురువుకే వుంటుంది. అందుకే ఈ గురుపౌర్ణమినాడు శాస్త్రోక్తముగ, సకల విధివిధానాలతో గురువునే ధ్యానమూర్తిగ సాధన చేస్తే, అటువంటి శిష్యుడికి ఈ లోకంలోని ప్రతీప్రాణిలోనూ గురువే దర్శనం యిచ్చి, కృతార్థుణ్ణి చేస్తాడు.

ఈ గురుపౌర్ణమినాడు, గురువు యొక్క పాదాలను శుభ్రంగా కడిగి, షోడోపచారములతో పూజించి, దక్షిణతాంబూలాదులిచ్చి, ముమ్మారు ప్రదక్షిణలు జరిపి, సాష్టాంగ నమస్కారము చేసిన శిష్యుడికి ఆ గురుని కృప పూర్తిగా లభ్యమై తలచిన క్షణంలోనే గురుదర్శనం అవుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

అందుకే పెద్దలు యిలా అంటారు.

**"ధ్యానమూలం గురోర్మూర్తిః**
**పూజామూలం గురోపదం**
**మంత్రమూలం గురోర్‌వాక్యం**
**మోక్షమూలం గురో కృపా!!"**

గురుగీతలో ధ్యానమునకు మూలమే గురువు యొక్క రూపం అనీ...

శిష్యునియొక్క శక్తికి మూలం గురువు యొక్క చరణాలనీ...


గురువు నుడివిన వాక్యమే మంత్రాలలో కెల్ల బలమైన మంత్రమనీ...

తాను మోక్షం పొందాలంటే గురుకృపయే మూలం అని చక్కగా వర్ణించారు.

"నియమమేషు తపశ్శ బద్ధః"

అంటే వేదంలో ఏదైతే నియమమని చెప్పబడివుందో దానిని ఋషులు తపస్సు అన్నారు. తపస్సు చేసేటప్పుడే స్వార్థం లేని యోజనతో గురువుపట్ల భక్తితో వున్నవాడే గురువు యొక్క కృపను పొందిన వాడవుతాడు. ఇటువంటి అత్యంత శుభకరమైన పుణ్యదినాన అనగా అషాఢ శుద్ధ పౌర్ణమినాడు భక్తి శ్రద్ధలే ముఖ్యమని ప్రతీవారు గ్రహించాలి. నిజానికి ఈ పౌర్ణమి సంవత్సరానికి ఒక్కమారే వచ్చి, మనల్ని పలకరిస్తున్న వేళ, శ్రద్ధా, భక్తి, ఉపవాసాలతో ఆ వ్యాస భగవానుని, సమర్థ సద్గురుడైన శిరిడీ సాయినాథునికి కలిపి, గురుపూజను మనసారా చేసిననాడు మన యొక్క జన్మ తరిస్తుంది. అప్పుడే గురువుల్లో సద్గురువు. గురువనే పవిత్రనామానికే ఆద్యుడైన శిరిడీ సాయి భగవానుడు, మనకు జ్ఞాన వైరాగ్యములు అనే అక్షయమైన సంపదలు యిచ్చి, కాపాడుతాడన్నది సత్యం.


జై సాయినాథా ! జై జై శిరిడీసాయినాథా !!





# సాయిపథం

శ్రీమతి పర్వతం రేవతీ ప్రసాద్, ప్లాటు నెం.115, డిఫెన్స్‌కాలనీ, సైనికపురి,
సికింద్రాబాద్ - 500 094, ఫోన్ : 040-27113964



ప ॥ గతం మరిపించేది, పథం చూపించేది !
ఆ సూత్రధారి శ్రీసాయే గదా మరి !

చ.1. ॥ కలియుగాన జన్మించిన కర్మచారులు !
మర్మమంత తెలుసుననే మాయదారులు !
దర్పముతో ఎందరో వెలిగిన వారు !
కాలగర్భములో అందరూ కలిసిపోయినారు ! ॥ గతం ॥

చ.2. ॥ ఎందులకూ కొరగానిది ఈ దేహము !
కలిగియుండు నెంతో అందమైన రూపము !
సుందరముగ ఉన్నదని అనుకుంటారు !
అస్థిపంజరముగ లోనుందని తెలుసుకోలేరు ! ॥ గతం ॥

చ.3. ॥ కనలేని కన్నులు, వినలేని వీనులు !
కలిగిన దేహానికి, అన్నీ సందేహాలు !
దేహమున్నంతవరకు యెన్నో సంబంధాలు !
బంధమే లేకుంటే యెవరికెవరు తెలియలేరు ! ॥ గతం ॥

చ.4. ॥ కలవరించిన వెల్ల కలలోన వరాలు !
కల చెదిరినంత అవి కరుగు మంచు కణాలు !
అనుభవించు సౌఖ్యాలు, అన్నియూ క్షణికాలు !
కలిగియున్నవేమి రావు, కొంతైనా తెలుసుకోరు ! ॥ గతం ॥

# గురుకృపయే గురుపూర్ణిమ

ఆర్.కైలాసరావు, శ్రీషిర్డీసాయిసేవామందరిం, ఉప్పాడ - 533 448,
తూ.గో.జిల్లా, ఆం.ప్ర

శ్రీసాయినాథుడు తన భక్తులను చేసుకోమని చెప్పిన ఏకైక ఉత్సవం గురుపూర్ణిమ. అదే గురుపూజ. అందువల్ల గురువును గురించి పెద్దలు తెలిపిన అమూల్యవిషయాలు, శ్రీసచ్చిదానంద సమర్థసద్గురు సాయినాథుల పాదపద్మములు పట్టి, అనుమతి వేడి, ఆయన నా మదిలో భాసింప చేసిన మేరకు వ్రాస్తున్నాను. విజ్ఞులు ఇందలి దోషములు నాదిగాను, సద్విషయాలు సాయికృపగాను స్వీకరించ వేడుకొంటున్నాను.

శ్రీస్వాయిస్వరూపులారా ! అనాదిగా గురుశిష్య సాంప్రదాయానికి మనదేశం నిలయం. ఆది గురువు శంకరుడని గురుచరిత్రలో చదివాం. పరాత్పర గురువు, సద్గురువు, సాధారణ గురువు, నకిలీగురువు అనే నాలుగు రకాల గురువులు మనకు తెలుసు. ఆత్మజ్ఞానియై, సర్వంతానై సర్వగత శుద్ధచైతన్యమై, తన చూపు, మాట, స్పర్శల మాత్రాన మానవులను ఉద్ధరించగల సర్వశక్తిమంతుడే పరాత్పరగురువు (సచ్చిదానంద సమర్థ సద్గురువు). ఈయన సాక్షాత్తూ శ్రీ దత్తాత్రేయులవారి అవతారమై వుంటారు. ఆత్మజ్ఞానం పొందినా, సాధన పూర్తిగానివారు, తనను అనుసరించేవారికి ఆత్మజ్ఞానం పొందటానికి మార్గం చూపగలవారు సద్గురువు. శాస్త్ర జ్ఞానం, మానసిక పరిపక్వత కలిగి సాధనలో వున్నా ఆత్మజ్ఞానం పొందనివారు, జనులకు వాచా సన్మార్గం బోధించగలవారు గురువులు. ఇక బాహ్యాడంబరం, వేషధారణలేగాని అంతరంలో



ఏ విధమైన దైవీ సంపదలేనివారు, గురువుల మని చెప్పుకొంటూ వాక్పటిమను, విషయపరిజ్ఞానం, జనాకర్షణమార్గాలు ఉపయోగించుకొని జనులను మోహంలో పడవేసే బోధనలతో ప్రక్కదారి పట్టిస్తూ స్వప్రయోజనాలు పొందేవారే నకిలీ గురువులు.

సద్గురువుని తెలుసుకోవడం ఎలా ? మహాత్ముల చరిత్రను చదవడం ద్వారా సద్గురు లక్షణాలు తెలుస్తాయి. శ్రీగురుచరిత్రగాని శ్రీగురుగీతగాని పారాయణ చేయడంవల్ల సద్గురువును కలవవచ్చు, తెలుసుకోవచ్చు. కేవలం సర్వదేవతానుగ్రహం, మహాత్ముల కరుణ, పరబ్రహ్మ కృపవల్లనే సద్గురువు లభిస్తాడని గుర్తుంచుకోవాలి. అది అనేక జన్మల పుణ్యఫలం.

గురువు అనే పదానికి అర్థాలు అనేకం పెద్దలచే చెప్పబడ్డాయి. శ్రీసాయి గురువును మార్గదర్శి అన్నారు. అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞాన జ్యోతి వెలిగించేవాడే గురువని ఎక్కువమంది చెప్పిన అర్థం. 'గు' అంటే మాయ, భ్రాంతులు, 'రు' అంటే మాయం చేయును అని అర్థం. 'గు' అంటే గుణాతీతుడు, 'రు' అంటే రూపంలేనివాడు అంటే పరబ్రహ్మ. 'గ'కారం గణేశరూపం, 'ర' కారం అగ్నిబీజం. ఉకారం విష్ణురూపం, ఈ మూడింటి కలయికయే గురువు. గురువు త్రిమూర్తి స్వరూపం. తత్వజ్ఞానం కలిగించి బ్రహ్మ, అజ్ఞానం నుండి రక్షించి విష్ణువు, జన్మపరంపరలు నశింపజేసి మహేశ్వరుడు అయినారు. భక్తివైరాగ్యాలు జనింపచేసి బ్రహ్మ, ఆత్మానందస్థితి కల్గించి విష్ణువు, అరిషడ్వర్గాలు నశింపజేసి రుద్రుడు అయినాడు.

కేవలం గురువు మాత్రమే మనకు సంపూర్ణజ్ఞానం ప్రసాదించగలదు. భ్రాంతికిలోనయినందున, గురుతత్వం తెలియనివారికి వేదశాస్త్రపురాణాదులకు విపరీతార్థాలు స్ఫురిస్తాయి. గురుతత్వము ఎరుగని వారు మూఢులు కనుక

వారు చేయు యజ్ఞ,యాగ, తప, జప, దాన యాత్రాదులు వృధా అవుతాయి. గురు అనుగ్రహం పొందనివారు సాధనావిధానం తెలియలేరు. గురు మార్గదర్శకత్వంలో మాత్రమే గమ్యాన్ని చేరగలం. కేవలం గురు సానిధ్యం వల్ల, వారికి సర్వశ్య శరణాగతి చేయడం వల్ల, అన్నీ లభిస్తాయనడానికి శ్రీసాయి చెప్పిన అమృతవాక్కులు జ్ఞాపకం చేసుకొందాం. "నా గురువును 12 సం။లు సేవించాను. వారే మంత్రము ఉపదేశించలేదు. ఏ సాధనా తెలుపలేదు. వారిపై విశ్వాసముతో, మనస్సు వారిపై నిలిపి, వారికి సేవచేస్తూ, వారి కృపకై ఓర్పుతో నిలిచాను. ఈనాటి నా స్థితికి నా సద్గురు కృపే కారణం".

"సద్గురు దృష్టే శిష్యుడికి అన్నపానీయాలు."

"గురువే అన్ని దైవాలున్నూ, సాధనా చతుష్టయం, శాస్త్ర షట్కం అక్కరలేదు."

"సద్గురువుకు పగ్గాలప్పగించాక చింతకు తావే లేదు."

కేవలం గురుచరణాలు వదలక పట్టుకోవడమే మన కర్తవ్యం అని బాబా చెబుతున్నారు.

గురుసేవ ఎలా చెయ్యాలి అన్నది జ్ఞాపకం చేసుకుందాం. సాయికృప పొందిన మీకు తెలియనది కాదు. అయినా మరల అనుకోవడం వలన బుద్ధి స్థిరపడుతుంది. మహాత్ముల గురు సేవ గురించి చెప్పిన భావాలు మన హృదయంలో స్థిరంగా పదిలపరచుకోవాలి. గురుగీతలో తత్వం, తపస్సు, దానం మొదలైనవన్నీ గురువుకన్న అధికం కాదని చెప్పబడింది. ధ్యానం, పూజ, తీర్థయాత్ర, సాధన మొదలైనవి గురు ఆశీర్వచనంతో మాత్రమే ఫలవంతమవుతాయి. గురుబోధయే మనకు ఆత్మజ్ఞానం కలుగజేయగలదు. గురువు యెడ నమ్మకం, భక్తి, గురుసేవలో శ్రద్ధా, ఓరిమి కలిగివుండాలి.



"పూచికపుల్లనైనా గురువుగా పెట్టుకో తరిస్తావు" అన్నారు బాబా. గురువు సామర్థ్యం తక్కువగా భావించరాదు అని పై వాక్యాల భావం కావచ్చు. గురువును ఇతరులతో పోల్చరాదు. మనం అజ్ఞానులం కనుక గురుశక్తిని తెలుసుకోలేక వారిని శంకిస్తాం. దీనివల్ల వారిపై శ్రద్ధ, భక్తి తగ్గుతాయి. ఇది పతనానికి నాంది. క్రమంగా గురువుకు దూరమవుతాం. నీ గురువు అసమర్థుడైనా, నీ గురుసేవ పరిపూర్ణమైనదైతే ఆ పరబ్రహ్మ అనుగ్రహించి నిన్నుద్ధరిస్తాడు. నీ గురువు అనుమతితో వేరే గురువుల వద్ద జ్ఞానం పొందవచ్చుగాని వారిని గురువుగా ఆశ్రయించరాదు. సద్గురుని శరణు వేడటం తప్ప మనకు వేరు దారిలేదు. గురుకటాక్షం లేనిదే సాధన పరిపూర్ణం కాదు. గురువే దైవం. ఆయన అన్నీ సమకూర్చగలడు అన్న భావం బలంగా వుండాలి. గురువులోనే సకల దైవాలను చూడాలి. గురుపాదసేవ, గురుపాదతీర్థ సేవనం, గురోచ్ఛిష్టభోజనం అనంత ఫలాన్నిస్తాయని గురుగీత చెబుతుంది. గురువాజ్ఞ వేరే ఆలోచన లేకుండా పాటించాలి. అదే ధర్మం. అదే శాస్త్రం. గురుచరిత్రలో పండని జొన్నచేనును కోసిన రైతు, సాయిచరిత్రలో మేకను చంపబోయిన దీక్షిత్ సంఘటనలు ఈ విషయాన్ని రూఢి చేస్తున్నాయి. గురుసేవలవల్ల పూర్వకర్మ దోషాలు నశిస్తాయి. కేవలం గురుసాన్నిధ్యం, గురుసేవ తన యొక్క అనంతశక్తి కారణమని శ్రీసాయి చెప్పారు కదా !

శ్రీసాయిభక్తులారా ! మన సర్వస్వాన్ని శ్రీసాయికి అర్పించడం ఆయన అనుగ్రహించింది కష్టమైనా సుఖమైనా ఆనందంగా స్వీకరించడం, శ్రద్ధ ఓరిమిలను వీడకుండటం, నిరంతరం ఆయనను మదిలో నిలుపుకోవడం, ఆయన అనుగ్రహం కొరకు వేడుకోవడం, ఆయన సేవకే మన జీవితాన్ని అంకితం చేయడం, గురుపూర్ణిమ పర్వదినం నుండి మనదీక్ష కావాలి. అదే

సాయిసన్నిధికి చేర్చే బాట. **అట్టి శక్తి, శ్రద్ధ, భక్తి, సబూరి ప్రసాదించమని శ్రీసచ్చిదానంద సమర్థసద్గురు సాయినాథుని ప్రార్థిద్దాం.**

పూర్ణుడైన గురువు కృపపొందిన రోజే మనకు గురుపూర్ణిమ. మనకు ప్రతిరోజు గురుపూర్ణిమ అనుగ్రహించమని వేడుతూ శ్రీసాయి సద్గురువును సేవిద్దాం.


## SRI SHIRDI SAI SEVA TRUST

206/A, Sector-8, Ukkunagaram, Visakhapatnam - 530 032
(Phone : 0891-2510817, Cell : 9849645224, 9490812114)

*Invites you to*

**STATEWIDE CONVENTION OF**
**SAI DEVOTEES & 14th PADUKA MAHOTSAVAM**

*On*

**17th & 18th August, 2008**

which will be bringing under one umbrella
the various living embodiments of SAI

*and*

also the Editors of different Sai Spiritual Magazines
published in Andhra Pradesh

*At*

**Gurajada Kalakshetram, Sector - 9, Ukkunagaram,**
**Visakhapatnam - 530 032**

Yours
**V.V.Poornachandra Rao**

Release of **"SAI SWAROOPALU"** Souvenir
featuring Telugu Articals.




# మార్గదర్శకుడు గురువే

**సాయికృష్ణ,** ఛైర్మన్, శిర్డిసాయిసత్సంగచారిటబుల్ ట్రస్టు, అనంతపురం,
సెల్ : 9912738815

మనిషికి గురువు అవసరం ఉన్నదా? గురువు లేక శిష్యులు జీవించలేరా? గురువును గుర్తించినా గుర్తించకపోయినా, ఆరాధించినా, ఆరాధించకపోయినా, గురువు శిష్యుణ్ణి మరవక ఉండదు. అజ్ఞానంవల్లనో అహంకారంవల్లనో, పదవి, ధన, కనక, వస్తు, వాహనాల మైకంవల్లనో, స్త్రీ, పుత్ర,మిత్ర, బంధు వ్యామోహంవల్లనో శిష్యుడు గురువును మరచినా గురువు శిష్యుణ్ణి మరవరన్న వాస్తవం సాయిసచ్చరిత్రలో ఎన్నో దృష్టాంతాలవల్ల మనకు తెలుస్తోంది. గురువు కర్మలను తొలగించలేనప్పుడు, ఎవరి కర్మలు వారు అనుభవించాలన్నపుడు గురువుతో పనేమిటి? అన్న హేమాడ్‌పంతుకు సాయి కనువిప్పు కలిగిస్తారు. అహంకారాన్ని వదిలి నా చరిత్రను రాయడానికి ప్రయత్నించు. నిన్ను సాధనంగా చేసుకొని నా చరిత్ర నేనే రాసుకుంటానన్నారు సాయి. సాయి బుక్కా ఫకీరు, మోసగాడు అనుకొంటూ బాబా దర్శనం చేసిన బాలాభాటేపై బాబా ఒక వస్త్రం కప్పినంతనే అతడు ధ్యానసమాధిస్థితికి వెళ్లి సాయిబాబా జగద్గురువని అంగీకరిస్తాడు. గురువు మార్గదర్శకుడు అతని తోడులేనిదే అడవివంటి సంసారాన్ని దాటలేవు అని కాకాసాహెబుతో సాయి అన్నారు. మనం పూజలు చేసినంత మాత్రాన, పుణ్యక్షేత్రాలు దర్శించినంత మాత్రాన మన కర్మలు నశించవు. నాసిక్‌లో కాకాజీవైద్య సప్తశృంగీదేవత పూజారిగా ఉన్నా అతనికి మనశ్శాంతి లేదు. పూజ ఉద్యోగ ధర్మం. పుణ్యం

కాదు. బాబాను షిర్డీలో దర్శించగానే అతనికి మనశ్శాంతి లభించింది. మనం విలువైన వస్తువులను వ్యక్తులను జంతువులను కోల్పోతే తీవ్రనిరాశకు గురికావడం సహజమే. చాంద్‌పాటిల్ అడవిలో గుర్రాన్ని వెతుకుతూ వెళ్ళినప్పుడు బాబా గుర్రం జాడ తెలిపి ఆశ్చర్యం కలిగించారు. పాటిల్ ఆశ్చర్యంతో పాటు ఆనందం ఆత్మశాంతిని పొందారు. గుర్రాన్ని ఇవ్వడం అంటే మార్గాన్ని చూపడమే ! **మనం పోగొట్టుకున్నది తిరిగి పొందాలంటే మన ప్రయత్నం కన్నా గురువు అనుగ్రహమే ప్రధాన సాధనమవుతుందన్న తాత్విక సత్యం స్వానుభవం వల్లనే ఎవరికైనా తెలుస్తుంది.** రెండు నెలలు తీవ్రంగా గాలించినా లభించని గుర్రం కేవలం బాబా దయవల్లనే దొరికిందన్న సత్యం చాంద్‌పాటిల్ స్వానుభవం. చాలామంది మన ప్రయత్నం వల్లనే అన్నీ సాధిస్తాం అనుకుంటారు. కొన్ని గ్రంధాలు, మతాలు 'అత్తదీపోభవ' అంటూ నీకు నీవే దీపానివై చీకటి దారిలో వెలుగు చూపుకుంటూ ప్రయాణం చేయి అంటాయి. భగవద్గీతలాంటి గ్రంథాలు 'ఉద్ధరేదాత్మ దాత్మానాం' అంటూ నీ ఆత్మను నీవే ఉద్ధరించుకో అని ఘోషించాయి. కాని ఇవన్నీ సాయి సంప్రదాయానికి విరుద్ధం. 'మన సంప్రదాయమే వేరు' అన్నారు సాయి. అరిషడ్వర్గాలు మాయాజాలంలో ఇంద్రియాల ఇంద్రజాలంలో ఇరుక్కుపోయి నిద్రలేచించి మొదలు మళ్లీ నిద్రించేవరకు ఇహలోక జంజ్యాటాల్లో తలపగిలిపోయేలా ఆలోచించే మనిషి తన ఆత్మను ఉద్ధరించుకోవటానికి ప్రయత్నిస్తాడనుకోవటం భ్రమ. అలా ప్రయత్నించాలన్నా అది సాయిప్రేరణే తప్ప మరొకటి కాదు. సర్వజీవుల హృదయాకాశంలో సాయి ప్రేరణశక్తిగా ఉన్నారు. అందుకే లక్షలాది భక్తులను ఉద్ధరించారు. సిరిసంపదలు లేకుండానే



నేను చిన్నప్పటినుండి ఆనందంగా ఉన్నానని డయోజనీస్ అలెగ్జాండర్‌తో అంటాడు. బాబా కూడా అంతే నేను ఆనంద స్వరూపుణ్ణి అన్నారు. బాహ్య ప్రపంచవస్తువుల్లో వ్యక్తుల్లో భోగభాగ్యాల్లో ఆనందాన్ని అన్వేషించే అల్పజ్ఞులమైన మనకు నిజమైన ఆనందం ఎలా లభిస్తుంది? అద్భుతమైన ఆత్మజ్ఞానం కలిగి ఉన్నప్పుడే అత్యంత సంతృప్తి, ఆత్మశ్శాంతి లభిస్తుంది. అది మనకు దుస్సాధ్యం. గురువు అనుగ్రహంవల్లనే సాధ్యం. విషయానందం తుచ్ఛమైనది. భజనానందం కొంత మెరుగైనది. బ్రహ్మానందం చాలా గొప్పది. మనలో మనం స్థితం కావటమే బ్రహ్మానందం. అది ధ్యానం ద్వారా సమాధిస్థితిలో చిత్తవృత్తినిరోధం జరిగినప్పుడే మనం పొందగలం. చంచల మనస్కులకు అది కష్టసాధ్యమే. **సాయికృపతోనే మనసు స్థిరత్వం పొందుతుంది.** ఆత్మశ్శాంతికోల్పోయిన సాఠే, నానాచందోర్కర్, అంబడేకర్, కాకా మహాజని లాంటివారికి సాయి అనుగ్రహంవల్లనే ఆత్మశాంతి లభించింది. వారికి సాయిలాంటి జగద్గురువు దొరికాడు. సత్యం తెలిసింది. ఆత్మశాంతి లభించింది. 1850 నుండి 1950 మధ్యకాలంలో ఎందరో సిద్ధపురుషులు అవతరించారు. అక్కల్‌కోటమహారాజ్, తాజుద్దీన్ బాబా, వాసుదేవానంద సరస్వతి స్వామి, శిర్డిసాయిబాబా లాంటి మహోన్నత గురువుల రూపంలో శ్రీదత్తాత్రేయులు అవతరించారు. భక్తులను ఉద్ధరించారు. గురువంటే దత్తాత్రేయులే. ఆది గురువు దత్తాత్రేయుడే. సర్వగురు రూపాలు దత్తస్వామివే ! బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రిమూర్త్యాత్మకరూపం దత్తస్వరూపం. గురువు అవసరం లేదంటే త్రిమూర్తుల అవసరం లేదు. త్రిమూర్తులు లేకపోతే సృష్టి ఆగిపోతుంది. సృష్టిలేకపోతే నీవు లేవు. నీవు ఉండాలంటే గురువు ఉండాలి. నీవే గురువన్నది అజ్ఞానం వల్ల నీకు తెలియదు.

# గురుప్రాధాన్యం

–కె.ఆర్. విజయ్‌కుమార్, మదనపల్లి, చిత్తూరుజిల్లా

అంతఃకరణశుద్ధికి, ఆధ్యాత్మిక జ్ఞానలబ్ధికి ఒక సాధనా మార్గాన్ని ఉపదేశించే మహనీయుడైన వ్యక్తి అవసరం. అతడే 'గురువు'. గిరితి అజ్ఞానం గృణాతి ఉపదశతి ధర్మం ఇతి గురుః అని గురుశబ్దానికి నిరుక్తి చెప్పబడుచున్నది. శిష్యునియొక్క అజ్ఞానమును మ్రింగివైచి శిష్యునకు ధర్మము ఉపదేశించువాడు గురువు అని ఇచట నిర్దేశించబడినది.

మాతృభక్తి చేత భూలోకము, పితృభక్తిచేత భూమికి పైన ఉన్న బ్రహ్మలోకం తప్ప గురువుని సేవించుట చేత మాత్రమే సాక్షాత్తుగా బ్రహ్మలోకమును మనుజుడు పొందగలడని మనువుమాట. ఆగమసారగ్రంధ వాక్యము ననుసరించి గురుశబ్దము నందలి గకారము జ్ఞానసంపత్తిని ఒసంగునని, సరోత్కృష్టమగు తత్వమునను ప్రకాశింపజేయునది అని ఉపకారుడు శివతత్వమును పొందించునది అని ఈ మూడు విధములగు విషయములను ప్రసాదించు సామర్ధ్యము కలవాడే గురువు అని స్పష్టమగుచున్నది.

మానవ జీవనము నందు గురువునకు ఇంతటి వైశిష్యం ఉండుటచేతనే మానవాళి యావత్తు తన నిరంతరం జ్ఞానాన్వేషణలో ఉత్తమోత్తములైన గురువుల కోసమై ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉన్నది. ఈ ప్రయత్నంలో మహత్తర జ్ఞానక్షేత్రమైన మన భారతదేశం విశ్వగురుపీఠాన్ని శాశ్వతంగా అదిష్ఠించింది. అధ్యాత్మిక జగత్తులో మహోన్నత గురుపరంపరను విశ్వానికి అందించింది. శుద్ధ సత్త్వ స్వరూపుడైన సదా శివునితో ప్రారంభించి సనకసనందనాది జ్ఞానులను, నారద, పరాశర, వ్యాస, గౌతమ, కపిలాది మునీంద్రులను, ఆదిశంకరులవంటి యతి గుణశేఖరులను, సర్వశ్రేష్ఠత జేసి గురువులుగా లోకమందు నిలిపిరి. అందుచేతనే సచ్ఛిష్యులందరూ నిత్యం పరమోత్కృష్టగురుస్మరణం చేయటం ద్వారా తమ జీవితాలను చైతన్యవంతం చేసుకుంటున్నారు. గురువు కోపిస్తే దేవతలందరూ కోపిస్తారట. గురువు తృప్తిచెంది ప్రసన్నుడైతే దేవతలందరూ ప్రసన్నులౌతారట. కనుక సమస్త దేవతా ప్రీతికరమైన గురుసేవా దీక్షితులమై మన ఆధ్యాత్మిక జీవనాన్ని సార్ధకం చేసుకుందాం.

## చందాదారులకు మనవి

శ్రీసాయిదర్శన్‌ను ఏప్రియల్ 2008 నుండి ఎక్కువ పేజీలు, టైటిల్ ఆర్టుపేపరుపై ముద్రించి సాయిబంధువులకు అందిస్తున్నాము. అందువల్ల అదనంగా ఖర్చు భరించవలసి వస్తుంది. అందుకొరకు పత్రిక చందా పెంచకుండా మీకు అందుబాటులోనే 'శ్రీసాయిదర్శన్' మీ ఇంటికి పంపుట జరుచున్నది. ప్రతి చందాదారులు శ్రీసాయిదర్శన్‌కు ముగ్గురు సభ్యులను చేర్పించి, ఉచిత కానుక పొందగోరుచున్నాము. బంధుమిత్రులను సభ్యులుగా చేర్చుటగాని, లేదా బంధువుల పేర మీరు చందా చెల్లించిన వారికి మీ కానుకగా పంపుచున్నట్లు ఉత్తరం ద్వారా వారికి తెలియపరచగలం.

శ్రీసాయి ప్రబోధ ప్రచారమునకు మీ సహాయ సహకారములు అందించి శ్రీసాయినాథుని కృపాకటాక్షములకు పాత్రులు కండి.

– రావూజీ, ఎడిటర్

# సాయిచరిత్రలో మరపురాని మరో మధురదినం

-రావూజీ



సాయిబాబా భక్తుని జీవితంలో ఏదో ఒక దినం మరవలేనట్టిదిగా ఉంటుంది. ఆ దినాన్ని ఆ భక్తుడే గాక ఇతరులు కూడా జ్ఞాపకం వుంచుకోవటమే ఒక విశేషం. అటువంటి రోజే జూలై మొదటి తారీఖు.

ఆ దినమునాడే 1899న స్వామి బాలకేశవయ్య జన్మించారు. బాలయ్య, సంజీవమ్మ పుణ్యదంపతులకు. అదే విశేషం. ఆ దినానికి అనుకుంటే పొరపాటే అవుతుంది.

ఆ దినం నాడే స్వామి బాలకేశవయ్య ప్రప్రథమంగా సాయిబాబా అనే పేరును విన్నది. ఆయన స్నేహితుడైన మల్లిరెడ్డిగారు “బాబాను పూజించు; నీ కష్టాలు తీరుతవి” అన్నారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో శ్రీసాయిబాబా పవిత్రనామం మొదటిసారి ఆ రోజు నా చెవిలో పడింది. పేరు విన్నానే గాని ఇతర విషయాలు తెలియవు. సాయిబాబా అనుకుంటూ, వారిని గురించే ఆలోచన చేస్తూ. ఇంటికి వచ్చి శ్రీమల్లిరెడ్డి చెప్పిన విషయం నా భార్యకు చెప్పాను. ఆ రాత్రి చాలాసేపు మేము బాబాను గురించి చెప్పుకొని వారి (సాయి) పటాలు తెప్పించుకొని పూజచేద్దాం అని స్వామీజీ పలికేరు. అది మాత్రమే విశేషం కాదు, ఆశ్చర్యం !



సాయినామాన్ని నిండు మనసుతో స్మరిస్తే చాలు, పలికితే చాలు సాయి ప్రసన్నులవుతారు. అదే జరిగింది. ఆశ్చర్యం కొలిపేటట్లు అద్భుతమైన రీతిలో సాయిబాబా స్వామీజీకి స్వప్నదర్శనమిచ్చారు. అంతే ! ఆనాటినుండి ‘స్వామి బాలకేశవయ్య సాయిభక్త కేశవయ్యగా రూపొందటం జరిగింది. సాయికృపను ఆ స్వామీజీ తనకు, తన కుటుంబానికి మాత్రమే పరిమితం చేసుకోలేదు. ఎల్లలు. దాపరికము లేనిదే సాయికృప అని స్వామీజీ జీవితం తెలియజేస్తుంది. స్వప్నంలో స్వామీజీకి సాయి తన కృపను అందజేసిన తర్వాత, స్వామీజీ షిరిడీకి వ్రాసి సాయిబాబా ఫోటో, విభూతి తెప్పించుకొనవలసిన అవసరమే లేక పోయింది. ఆ మరునాడే ఆయనకు సాయిఫోటో, ఊధి షిరిడీ నుండి అందేయి. అది మరో ఆశ్చర్యకరమైన సంఘటన. ఎందుకంటే స్వామీజీ పేరు. ఊరు షిర్డీ సంస్థానానికి తెలియదు కనుక.

## ఇద్దరే ఇద్దరు :

దక్షిణ భారతదేశస్తులకు సాయిబాబా అంటే ఎవరో తెలియపర్చినది శ్రీ బి.వి.నరసింహస్వామిగారు. వ్యాస నరసింహ స్వామీగారే స్వామీజీని గూర్చి ఇలా పలికేరు “ నా ఉపన్యాసాలను వెయ్యిమంది వింటే అందు నూరుమంది మాత్రమే ప్రయోజనాన్ని పొందవచ్చును. స్వామీ కేశవయ్యాజీ జరిపే బాబా పూజలకు వెయ్యిమంది హాజరైతే అందు తొమ్మిదివందల మంది ప్రయోజనం పొందుతారు!”.

అంతటి ప్రయోజనం పొందిన భక్తులు, స్వామీజీని సాయిబాబాయే అనటం కూడా మొదలుపెట్టారు. స్వామీజీని మాయ కమ్మలేదు. శ్రీసాయిబాబా అనుగ్రహంవల్ల తనకు లభించిన కొన్ని సిద్ధుల వల్ల తాను సాయిబాబా అవటం కల్ల అని శ్రీస్వామీజీ నిర్ద్వందంగా పలికారు. స్వామీజీ వినయము, నిష్కాపట్యము, సత్యము అందరిని ఆకర్షించేది.



సాయిబాబా స్వామీజీపై కృపా వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నారు. స్వామీజీ రోగులను, వ్యాధులను ఊదితో నయం చేయటం ముందు జరగబోయే సంఘటనలను వెల్లడించటం మొదలైన ప్రాపంచిక విషయాలతో భక్తులకు ఊరట కల్గించటమే గాక, అనేక వేలమందికి సాయిబాబా పాదపద్మాలకు ఆకర్షించారు. వారికి కూడా ఆధ్యాత్మిక ఔనత్యాన్ని కలిగించేరు. రోగుల వ్యాధులకు నయం చేయటం కోసం తాను జబ్బు పడటం అనేక సందర్భాలలో జరిగింది. ఇదంతా సాయి లీల అంటారు స్వామీజీ. అటువంటి మహనీయుడు చూపిన అశేష లీలలో కొన్నింటిని శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావుగారు లిఖించగా, ఆ రచనకు పేరు పెట్టవలసి వచ్చినప్పుడు, శ్రీస్వామీజీ 'శ్రీసాయి మహిమ' అనే పేరు పెట్టారు. తాను ఏమిచేసినా అంతా సాయికృప అనే నిష్కామ మహామహితాత్ముడు శ్రీస్వామీజీ. జూలై1 సాయిచరిత్రలో మరపురాని మరో మధుర దినం !



1. సాయిని బంగారంలా కొలవండీ, బతుకులను భాగ్యనగరంలా చేసుకొనండి.
2. బాబాను తారకమంత్రంలా తలవండీ – ఆ మార్గాన మహానందంను పొందండి.
3. కేరట్ తింటే రక్తం పడుతుంది – సాయి కీర్తిని వింటే మోక్షం వస్తుంది.
4. సూర్యుడు తూర్పు దిక్కున మాత్రమే ఉదయిస్తాడు. కానీ సాయిబాబా అన్నిదిక్కుల ఉదయిస్తాడు.
5. కావున మనందరం సాయి, ఆక్సిజన్‌లా అనుకొని హాయిగా లోకాన విహరిద్దాం.
6. సాయినామం మన అజ్ఞానమును తొలగించి విజ్ఞానమందు బాబా స్మరణ ద్వారా అందిస్తుంది.
7. సాయిని నిత్యం తలుస్తుంటే జీవనం జామముక్కలాగా బాబాని ప్రతినిత్యం తలస్తుంటే జీవితం జాంగ్రీముక్కలాగా వుంటుంది.
8. సాయిబాబాను పూజించవలయుననే ఆలోచన ఒక్కటే మరో జన్మను అందుకొను నవకాశమిస్తుంది.
9. సూర్యునికి అస్తమయం వున్నది కాని సాయికి మాత్రం ఆ పనిలేదు.
10. ఆకాశానికి చంద్రుడు భూలోకానికి బాబా అందం.
11. అమ్మ లాలన కన్న సాయి ఆలన పాలన ఎంతో మధురంగా వుంటుంది.
12. సాయినామం అజ్ఞానంను తొలగించి, స్మరణం జ్ఞానం కలిగిస్తుంది.
13. సాయియే సృష్టికంతటికి మూలం.
14. సాయియే సృష్టికి పెద్దదిక్కు, సాయికి నిత్యం మొక్కు.
15. ఆకాశాన ఎన్ని చుక్కలున్న చందమామే అందం, లోకాన ఎందరు దేవుళ్లున్నా సాయిబాబాయే అందం.
16. మీరందరు ఈ సృష్టికర్త సాయినే మనస్ఫూర్తిగా నమ్మి జన్మలను సార్ధకం చేసుకోండి.
17. మహాభారతకథ కన్నా సాయి కథే మిన్న.
18. భగవాన్ సాయి వలన మాకు ఎల్లప్పుడు శుభం జరుగుచున్నది. ☐

( 'సాయిభక్తమాల' అను గ్రంథము నుండి .... )

# 6. బాలాసాహెబ్ భాటే

**చరణ్ జనమంచి**


*(గత సంచిక తరువాత భాగం)*

**అసలు పేరు** : **బాలా సాహెబ్ భాటే**

**పిలవబడిన పేరు** : **భాటే**

**వృత్తి** : **మమలతదారు**

**బాబాను దర్శించిన సం॥ : 1909**



ఆధ్యాత్మికతత్త్వం ఎవరికి ఏవిధంగా ప్రాప్తిస్తుందో ఆ భగవంతునికే తెలుస్తుంది. భాటే చిన్నతనం నుండి నాస్తికునిగా ఉండెను. 1904-09 వరకు కోపర్‌గాంకు మమలతదారుగా నుండెను. యోగులను, వారి ప్రవర్తన విధానములను తీవ్రంగా నిందించేవాడు. సాయిబాబా ఒక పిచ్చివాడని మిత్రులకు, బంధువులకు చెప్పగా వారు "నువ్వు ఒకసారి సాయిబాబాను దర్శించిన తరువాత ఏమైనా మాట్లాడుము'' అని వారి భావం ప్రకటించిరి.

భాటే 1909న ఉద్యోగరీత్యా షిరిడీకి వెళ్ళాడు. నాలుగు రోజులు క్రమంగా సాయిబాబావద్దకు వెళ్ళెను. 5వ రోజు బాబా అతని మీద ఒక కాషాయవస్త్రం కప్పెను. ఆ క్షణం నుండి భాటేలో మార్పువచ్చెను. అప్పటి నుంచి తన చివరి ఘడియ వరకు సాయిసన్నిధిలో గడపటానికి నిర్ణయించుకొనెను.

రానురాను భాటేకు 'గురుభక్తి-లోకంపై విరక్తి పెరుగుటచే ఉద్యోగమునకు స్వస్తి చెప్పెను. బాబా అనుగ్రహంతో రూ.30ల పింఛను ప్రభుత్వంవారు భాటేకు ఇవ్వటానికి నిర్ణయించిరి. భాటేలో ఎంతగొప్ప మార్పు వచ్చిందంటే 1910లో హేమాడ్‌పంత్‌తో గురు ఆవశ్యకత గూర్చి వాదన చేసెను. గురుకృప, గురువే దైవంగా భావించాలని, మన జ్ఞానం, తెలివి, అహంకారం అన్నీ మరిచి గురువుని ఆశ్రయించాలి, గురుపాదసేవలో జీవితసాధన చెయ్యాలని, ఆ వాదనలో భాటే తన భావాన్ని తెలిపెను.

భాటే బాబా సమాధి అనంతరం 13వ రోజు శాస్త్రప్రకారం ఉత్తర క్రియలు పిండప్రదానం తిలతర్పణం చేసి బ్రాహ్మణులకు మరియు బీదలకు అన్నదానం చేసెను. (సశేషం)

### ఆధ్యాత్మిక దర్శన్

(1) ధనం, యౌవనం అస్థిరాలు, కేవలం భగవత్ప్రేమను, భక్తి మాత్రమే స్థిరమైనది. వాటిని పొందాలి.

(2) ఏది జరగాలో అది జరుగుతుంది. దాని కొరకు చింత ఎందుకు? భగవంతుని ప్రేమించు, అంతా మంచి జరుగుతుంది.

(3) ఇంటిలో వాళ్ళతోగాని, సమస్త ప్రపంచ మానవులతోగాని స్వార్థం విడిచి వారి హితమే చింతిస్తూ నడిచే నడవడి ఉత్తమమైనది. దానివల్లనే హృదయ శుద్ధికలుగుతుంది.

(4) పూర్వసంచిత పాపం వైరాగ్యాన్ని బాధిస్తుంది. కాని పరమాత్మ యొక్క శరణం వల్ల అది (ఆ పాపాలు) నశిస్తుంది.

(5) భగత్ప్రాప్తి కోసం సత్సంగం మీద విశేషమైన ఉత్కంఠ కలిగితే స్వయంగా భగవంతుడి ఏదో వేషంలో అతని దగ్గరకు రాగలగడం సంభవం.

# శ్రీసాయి చూపిన సాధన మార్గం
# మనం మరచిపోతున్నామా ?

సంకలన కర్త : యం. వెంకట్రావు, న్యూపాల్వంచ



''దుర్లభం త్రయమేవైత దైవానుగ్రహహేతుకమ్ ।
మనుష్యత్వం ముముక్షుత్వం - మహా పురుష సంశ్రయః ॥ ''

అని శ్రీశంకరాచార్యులవారు 'వివేకచూడమణి'లో చెప్పారు. మానవజన్మ మోక్షం మీద కోరిక - మహనీయుల సాంగత్యం. ఈ మూడు లభించటం చాలా కష్టం. కేవలం భగవంతుని అనుగ్రహం ఉన్నవారికే అవి లభిస్తాయని అర్థం. శ్రీసాయి దయతో మానవజన్మ లభించింది. మోక్షం మీద కోరిక లాంటి పెద్ద మాటలు వదిలేస్తే, (రేపటి భయం వల్లనైతేనేమి, ప్రాపంచిక సుఖాల మీద కోరికతో నైతేనేమి) భగవంతుడి మీద కొద్దో గొప్పో ఇష్టం అనేది కూడా ఏర్పడింది. ప్రత్యక్షంగా కాకపోయినా, వారి చరిత్ర గ్రంధాల ద్వారా శ్రీసాయి సాంగత్యం, సాన్నిధ్యం కూడా దొరికాయి. "దుర్లభం'' అని శ్రీశంకరాచార్యులవారు చెప్పినవి మూడు దొరికినా ఇంకా మానవుడికి దుఃఖం నీడలా వెంటాడుతోందెందుకు?



మానవుల్లో భక్తి ప్రపత్తులు పెరిగాయి. జిజ్ఞాసా పెరిగింది. అడుగడుగునా దేవాలయాలు, అందులో క్రిక్కిరిసిన జనసముదాయమూ, కిటకిటలాడే తీర్థక్షేత్రాలు అంతా బాగుంది. అన్నీ బావున్నాయి. మరి మానవుడిలో ఇప్పటికీ ఎందుకీ అశాంతి? ఎందుకీ నిర్వేదం.

గీతలో శ్రీకృష్ణమూర్తి "మనుష్యాణాం సహస్రేషు'' వేయిమందిలో ఏ ఒక్కడికో భగవంతుడి మీద ప్రేమ ఉంటుందన్నాడు. ద్వాపరయుగంలోనే అలా ఉంటే మరి నేటి యుగంలోని సంగతెవరు అడుగుతారు? మరి మనం యిప్పుడు చూస్తున్నదీ, పైన చెప్పుకొన్నదీ 'భక్తి' కాదని ఎలా అనగలం? ఆధ్యాత్మికత వేరు - లౌకిక జీవితం వేరు అంటూ రెండుగా విడగొట్టడం వల్లనే ఈ వైరుధ్యం కనిపిస్తున్నాదని మనం తలంచినట్లయితే "రోజూ సంధ్యావందనం చేస్తే ఏ రోజు చేసిన పాపాలు ఆ రోజు పోతాయట'' అన్నట్లుంటుంది.

తల్లికి తగిన బిడ్డలు కండి - మీ ధనాగారాలు నింపుకోండి'' అన్న సాయి పలుకులకు ఇదా అర్థం? ఆయన మన నుంచి ఆశించేదేమిటి? తన పేరు నిలబెట్టగల బిడ్డలుగా మనల్ని మారమనే!''

తనకు అంటూ ఏదీ మిగుల్చు కోకుండా, తనది అంటూ ఏమీ లేకుండా, రేపు అన్నదాని గురించి చింతలేకుండా, నిన్న గురించి పశ్చాత్తాపం లేకుండా, సంకల్పాల నన్నింటిని ధునిలో ఆహుతి చేస్తూ సంకల్పరహితుడుగా, సంకల్పసిద్ధుడుగా, వర్తమానంలో జీవిస్తూ అందరికీ ఆనందాన్నిస్తూ, అద్వైతాన్ని చరిస్తూ, అర్థార్థులను ఆదరిస్తూ వారిని

జిజ్ఞాసువులుగా, ముముక్షువులుగా ఏ బోధా చేయకుండానే ఏ ఉపదేశం యివ్వకుండానే, ఏ ఉపన్యాసమూ లేకుండానే, తీర్చి దిద్దుతూ, సాయి తాను గురువు ననో, దేవుణ్ణనో, ఎంత మాత్రము చెప్పక "అల్లా మాలిక్'' అనే పంచాక్షరీ మంత్రంతో అందర్నీ ఉద్ధరించారు. ఆధ్యాత్మిక ఉద్యానవనంలో మన జన్మాంతరవాసనలు పోగొట్టి మనలనందరినీ సువాసనలు వెదజల్లే పూలమొక్కలుగా తన ప్రేమ అనే నీటిని పోసి పెంచారు.

మనలను చూసి, మన జీవితవిధానాన్ని చూసి శ్రీసాయి ఆనందించేలా, గర్వించేలా మనం నడుచుకుంటున్నామా? ఎన్ని జన్మలకైనా మనం ఆ నడకను అందుకోగలమా?

సాయి మనకేమిచ్చారని ప్రశ్నించుకుంటే అసలు ఆయన యివ్వని దంటూ ఏముంది? కొన్ని మనకు తెలుసు. కొన్ని మనకు తెలియవు. అంటే గుర్తించడం ఈ దేహం, మనసు, బుద్ధి, ఇంద్రియాలు, ఆరోగ్యమూ, మనం తినే ఆహారము, పీల్చేగాలి, ఒకటేమిటి సర్వమూ ఆయన ప్రసాదించినదే. కాని విచిత్రమేమిటంటే, అంతా మనదే అనుకుంటాం నిజానికి మనదంటూ ఏముంది? అంతా మనదే అనుకుంటాం. అందుకే బాధ, దుఃఖం.

భగవంతుడిపై అనురక్తిని కూడయిచ్చి ఎంతో ఉపకారం చేశాడాయన. వీటిని సద్వినియోగం చేసుకోకపోతే, చేసుకోలేక పోతే, మళ్ళీ మనకు ఈ దేహమూ, దైవమూ దొరుకుతారా మనకు?

బాబా సందర్భవశాత్తు భక్తులతో చెప్పిన మాటల్లో, భావగంభీరత, భావసంస్కరణకు చాలా ప్రాముఖ్యం యిచ్చేవారు. ఎందుకొచ్చారు?... పిడకలేరుకోవడానికా? అని సాటివారిని నిందించటం, పంది చేసిన



మలభక్షణతో అది సమానమవడం - ఆలోచిస్తే ఎంత చెప్పినా వినని బిడ్డ అజ్ఞానానికి తల్లి వేదనతో అన్నమాటలనిపిస్తుంది. కేవలం పుస్తకపఠనంలోని వేదాంతపలుకులు పలకడమే తప్ప, సాటి మనిషిలో సాయిని సందర్శించగలుగుతున్నామా? సాయిని గూర్చి చదువుతూ అశ్రువులు ధారాపాతంగా కారుస్తాం. కాని అన్యజీవులపట్ల అనురాగం చూపగలుగుతున్నామా? అన్యాయం చేయకుండా ఉంటున్నామా? శ్రీరామనవమి ఉత్సవాలలో వచ్చిన వేలమందిలో పేదవృద్ధురాలిని ఆదరించి, ఆమె ఆర్తిని తీర్చి అక్కున చేర్చుకున్నారు సాయి ! అది చదివి పరవశించే మనము పొరపాటునైనా పరాయివాడి పొరపాట్లను సహించగలుగుతున్నామా?

రావణుని, కంసుని రాక్షసత్వాన్ని నాశనం చేయటానికి శ్రీరాముడిగా, శ్రీకృష్ణుడిగా అవతరించి, సంహరించటం తేలికైంది భగవంతుడికి. ప్రస్తుతం ఈ కలియుగంలో ప్రతిమనిషిలోని దానవుడు మానవుడు మిశ్రమంగా వున్నప్పుడు మనకు ఎంతమంది రాముళ్ళు, కృష్ణుళ్ళు కావాలో ఊహించుకోగలమా?

శ్రీసాయి ఎప్పుడూ భక్తులతో "ఈ మాయ నన్నే బాధ పెడుతోంది'' అనేవారు. నిజమే మనకు అన్నీ తెలుసు. చదువుకుంటాం, చెప్పుకుంటాం. ఆనందిస్తాం. వెంటనే మరచిపోతాం! కారణం మాయ ! అవతారపురుషుల్ని మాయ బాధిస్తుందా? లేదు. మనం దానిలో చిక్కుకుపోతున్నామనటానికి సంకేతంగా అలా చెప్పారు సాయి. అందుకే మహనీయుల జీవితచరిత్రలను పారాయణచేయించేవారు సాయి. శ్రీగురుచరిత్ర, శ్రీ ఏకనాథ భాగవతం, శ్రీభావార్థ రామాయణం, నిత్యకృత్యంగా పారాయణ చేయించేవారు.

ఎందుకిన్ని సార్లు పారాయణ? మనం కథను గుర్తుంచుకుని, అందులో అంతర్గతంగా వున్న భావార్థాన్ని మరచిపోతాం. తాత్కాలికంగా ఆనందాన్ని పొంది దాన్ని నిత్యజీవితంలో ఆచరించలేకపోతాం. అందుకే దీక్షతో సాయి యిలా అన్నారు "చదివి అర్థం చేసుకోవడంతో సరిపోదు. మళ్లీ మళ్లీ చదివి దాన్ని జీవితంలో అనుసంధానం చేసుకోవాలి'' అని. "చేస్తున్నామా అలా?'' పారాయణ కేవలం నామమాత్రంగా, మనకు సంబంధించినదికానట్లు, ఎవరికో చెందినదైనట్లూ, మనం దానికి అతీతులమైనట్లు భావిస్తాం. పారాయణతో శ్రవణం, అందులోని భావార్థ విశేషములతో ఇతరులతో పంచుకోవటంవల్ల మననం మరియు నామస్మరణం అవుతుంది. అందులో మనసు లీనం అవుతుంది. కనుక ధ్యానమూ అవుతుంది. ఇన్ని ప్రయోజనాలున్నాయి కనుకనే సాయి పారాయణ కంత ప్రాముఖ్యం యిచ్చి, పట్టుబట్టి మనతో మరీ చేయించేవారు. ఇతరుల వల్ల మనకు అపకారం జరిగినప్పుడు (నిజానికి అది మన ప్రారబ్ధం వల్లే జరిగినప్పటికీ) ఎందుకు సహించాలనిపిస్తుంది? దానికి బాబా సమాధానం యిలా చెప్పేరు. ఋణానుబంధం లేక ఏ జీవీ, నీ దగ్గరకు రాదు. వెనుకటి జన్మల్లో వారికి మనవల్ల తీరని అపకారం జరగబట్టే, వారివల్ల ఇప్పుడది జరిగింది అని మనకు గుర్తుకొస్తుంది. నిత్యమూ వీరి జీవితచరిత్ర పారాయణవల్ల, నామస్మరణ, మననంవల్ల కలిగే ప్రయోజనమిదే. మాయవల్ల 'మరపు' వచ్చినా సాయి పారాయణవల్ల 'ఎరుక'లో ఉంటాం. దానినే 'ప్రజ్ఞ' అన్నారు పెద్దలు. ఆ ఎరుకవల్ల సాటి జీవి పట్ల ప్రేమ జనిస్తుంది.



అయితే, మనకు లోపలినుంచి, మన హృదయాంతరాళంల్లోంచి రోదన, దేవుడి గురించి వేదన, పరితాపము, ఆయనను దర్శించుకోవాలన్న మదన, తపనతో కూడి యున్నప్పుడే సాధ్యమవుతుంది.

ఈతరాని మనిషి నదిలోపడి, బయటపడాలని ఎలా ప్రయత్నిస్తాడో, అలాగ మనం ప్రయత్నించాలి. తాత్కాలికానందాలు, సుఖాల నుంచి, భవసాగరంలోంచి బయటపడాలని, బుద్ధుడిలా, వివేకానందుడిలా, నచికేతుడిలా ప్రయత్నించాలి. ఆయన ప్రేమాగ్నిలో మన కర్మలను, వాసనలను, ఇచ్ఛలను, ప్రారబ్ధాలను దహించి వేసుకోవాలి.

"జన్మ దుఃఖం, జరా దుఃఖం'' అన్నట్లు ఏడుస్తూ పుడతాం. ఏడుస్తూ పెరుగుతాం, ఏడుస్తూనే చస్తాం. మన కోసం, మనవాళ్ళ కోసం కాకుండా, ఆయన కోసం మనమేమీ కోరకుండానే, మనకన్నీ ఇచ్చే సాయితండ్రి కోసం మనం ఏడవగలిగితే, కర్మ వాసనలతో కరడుగట్టిన మన హృదయాలు ప్రేమ నదులై ప్రవహించవా? ప్రారబ్ధాలన్నీ ప్రక్షాళనం అయే కన్నీటి బొట్టుకై సాయి ఎదురుచూస్తూ ఉంటారు. మనం మన కుటుంబ సభ్యులను ప్రేమించు కుంటున్నట్లే భగవంతుని ప్రేమించాలని మనకు తెలియక కాదు. భగవంతుడితో అంత దగ్గరి సంబంధం పెట్టుకోవడం మన కిష్టముండదు. మనం, కోరిన కోరికలు నెరవేరిన వెంటనే, మొక్కు తీరుస్తాం. అంతే, మళ్లీ మనకు తిరిగి ఆయన అవసరమొచ్చినంతవరకు, ఆయనతో మనకేం పని అనుకుంటాం.

తనకేం కావాలో తెలియని స్థితిలో ప్రస్తుతం మానవుడున్నాడు. సజ్జన సాంగత్యం పాలు నీళ్ల కలయిక వంటిది. సాధు సాంగత్యం వల్ల సద్గుణాలు, త్యాగం వంటి సుగుణాలు సంతరించుకుంటాం. నిరంతర పారాయణ వల్ల కలిగే మరో ప్రయోజనం సత్సంగం. అవిద్య నుంచి విద్యకు చేసే ప్రయాణమే సత్సంగం. అజ్ఞానం నుంచి జ్ఞానానికీ, దుఃఖం నుంచి ఆనందానికీ, మానవత్వం నుంచి దైవత్వానికీ తీసుకువెళ్లేది పారాయణ. భక్తతుకారాం, శ్రీఏకనాథ భాగవతాన్ని వెయ్యిసార్లు పారాయణ చేశారట. తత్ఫలితంగా సాక్షాత్తూ భగవంతుడే వచ్చి విమానంలో తీసుకుపోయాడు. అలాగే శ్రీగురుచరిత్రను నిరంతరం పారాయణ చేసిన శ్రీవాసుదేవానంద సరస్వతి సాక్షాత్తూ దత్తస్వరూపమయ్యారు. వివేక, విచార, వైరాగ్యాభ్యాసాలతో గూడిన సద్గ్రంధ పఠనంతో మన సమయాన్నీ, శక్తినీ సద్వినియోగం చేసికొని, శాంతిని పొంది సాయిని చేరుదాం. సాయిగా మారుదాం. తల్లికి తగిన బిడ్డలుగా మాత్రమే గాక ఆదర్శవంతమైన తల్లులుగా తండ్రులుగా తయారవుదాం. ఆ తండ్రిని సంతోషపెడదాం.

ఓం శ్రీసాయినాథాయ నమః

(శ్రీగురుపౌర్ణమి జూలై 18 సందర్భంగా శ్రీసాయితత్త్వాన్ని విశ్లేషిస్తూ స్మరణం)





# గుప్త దానం

చాలా సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లో భయంకరమైన కాటకం ఏర్పడింది. గోవుల పరిస్థితి మరీ బాధాకరంగా ఉంది. ఆ సమయంలో గీతాప్రెస్ తరపున రాజస్థాన్‌లో పలుచోట్ల సహాయక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

రతన్‌ఘడ్‌లో భాయాజీ కార్యక్రమం చూస్తున్నారు. వారొక రోజున మిట్టమధ్యాహ్నంవేళ తమ మకాములో ఒంటరిగా కూర్చొని వచ్చిన ఉత్తరాలు చూసుకుంటున్నారు.


అంతలో అక్కడికి ఒక సజ్జనుడు వచ్చాడు. ఆయన చాలా సంపన్నుడు.

ఆయనకు బెంగాలులో పెద్ద వ్యాపారం ఉంది, మహాదాత, అయితే, ఆయన తన కోసం ఖర్చు పెట్టుకొనటంలో చాలా పొదుపుగా ఉంటాడు. మోకాళ్ళు దిగిన పంచె, ఓ బనీను, నెత్తి మీద తలపాగ, శీతాకాలంలో ఒక ముతక కంబళి – ఇదే ఆయన వేషం. ఆయన వరుసకు భాయాజీకి మావయ్య అవుతాడు. ఆయన రాగానే భాయాజీ నమస్కారము చేసి వచ్చిన కారణం అడిగాడు. ఆయన చేతిలో ఒక చిన్న కాగితపు పొట్లం ఉంది. దానిని భాయాజీ చేతికి ఇస్తూ తీసుకో సోదరా ! ఇది పదివేల రూపాయలు. ఈ వేళప్పుడే నీవు వంటరిగా దొరుకుతావని ఈ మిట్ట మధ్యాహ్నం వేళ వచ్చాను. దీనిని గోసేవకు వినియోగించు, కానీ, చూడూ, ఎక్కడా నా పేరు మాత్రం పైకి రాకూడదు. దేవుని సొమ్ము దేవునికే ఇస్తున్నాం. ఇందులో ఇచ్చేవాడని రెండో వాడెవరి పేరో ఎందుకు రావాలి ? అన్నాడు బాయిజీ చిరునవ్వుతో సొమ్ము తీసుకున్నాడు. ఆయనకే తెలుసు, మామయ్య గుప్తదాన విధానం.

భాయాజీ ఆ తర్వాత చెప్పాడు, ఆయన ఇలా చాలా ధనం దానం చేస్తుంటాడని. చాలా చోట్ల నూతులూ, చెరువులూ, మరమ్మత్తు చేయిస్తుంటాడట. కొత్తవి కూడా త్రవ్విస్తూ ఉంటాడట, కానీ తన పేరు ఎవరికీ తెలియనివ్వడట. తెలియక పోతే పని కాదన్న సందర్భాలలో మాత్రమే అంతవరకే తెలియనిస్తాడట.

ఈ రోజుల్లో దానం పేరుతో పెట్టుబడి పెట్టేవాళ్ళు, దానం కంటే ముందుగానే పత్రికలకు దాన వార్తలు పంపించే వాళ్ళు. ఇలాంటి దాతలు ఈయననుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది.

(అభిజ్ఞుని హిందీ రచనకు తెలుగు అనువాదం.)



# శ్రీసాయినాథ భజనమాల

మూలము :శ్రీరఘునాథ్ , శ్రీమతి సావిత్రి బాయి టెండూల్కర్‌దంపతులు
తెలుగుఅనువాదం : శ్రీ రెంటాల విశ్వేశ్వరరావు, శ్రీమతి ఇందిరా కస్తూరి,
నరసారావుపేట, గుంటూరుజిల్లా



(1)విశ్వమంతా కీర్తివ్యాపించి యున్న ఓ మంగళమూర్తీ ! ముందుగా నా ప్రణామము లందుకోవయ్యా ! తొలిపూజ లందుకొనే స్వామీ! నాయీ అల్పమైన సేవను స్వీకరించు. పదునాల్గు విద్యలను ఉదరమునందు నింపుకొన్న దేవా! నీవు సర్వకళల యందును మహానుభావుడవు. అష్టసిద్ధులే నీ దాసులై నిన్ను సేవిస్తున్నాయి కదా ప్రభూ ! నన్ను నీ దాసునిగా స్వీకరించవయ్యా!



(2) చదువుల తల్లి సరస్వతికి వందనములు. గురువును కీర్తించే వరాన్ని ప్రసాదించు తల్లీ! నీ చరణములపై శిరస్సునుంచి, ప్రార్థిస్తున్నాను దేవీ ! నాకు వలసినంత స్ఫూర్తిని ప్రసాదించుము తల్లీ!

(3) సకల జనులకు బుద్ధిప్రదాయినివైన ఓ సరస్వతీ ! నీకు వందనము లమ్మా ! వేదభాషకు పుట్టినిల్లయిన నీ చరణాలనందే కదమ్మా సకల ముని, ఋషివరేణ్యులు





నివసిస్తున్నారు? సర్వాంగసుందరీ! బ్రహ్మాతనయా! నాయందు కృపాదృష్టిని ప్రసరింపజేయవమ్మా! భక్తులు సంకటస్థితిలో ఉన్నప్పుడు నీవు వెంటనే వచ్చి, ఆదుకోవమ్మా !

(4) సాయినద్గురు మహారాజుకి ప్రణామములు. భక్తిహీనుడను, అజ్ఞానుడను అయిన నాకు నీ గుణగానము చేసే శక్తిలేదయ్యా ! ఈ దీనునకు నీ చరణాల యందు శరణు యివ్వవయ్యా!

(5) సకల సాధుజనులకు అధికారివైన నీకు సాష్టాంగప్రణామములు సాయీ! అందరినీ సన్మార్గమున నడుపుటకు, జగత్కళ్యాణం కోసం నీవెంతగా శ్రమపడుతున్నావయ్యా ! ఇల్లు, వాకిలి, సంసార జీవితమే లేని నీకు, యీ దాసులందరును చేతులు జోడించి, నీ చరణారవిందాలకు నమస్కరిస్తున్నారయ్యా! నా వినతిని కూడ కనికరించి మన్నించు.

(6) ఏ తల్లి కడుపున జన్మించావో, ఆ తల్లికి ముందుగా నా నమస్సులు. తల్లీ ! నీవెంత మమతానురాగాలు పంచావమ్మా ! ఒడిలో లాలించి, భుజాలపై పాలించావు. అల్పవేతనము, బీదరికములలో ఎలా నడిపించావమ్మా సంసారాన్ని ? తీర్చజాలని ఋణమును ఎలా తీర్చను? దాసునిగా తల్లిదండ్రులకు ప్రణామములర్పించటం తప్ప!

(7) సద్గురుని కృపతో చెప్పుమాటలివి. సాటిలేని ప్రేమభావంతో భక్తిరసమును పానము చేయండి. దీనిని రుచి చూచి తీయదనాన్ని

అనుభవించండి. ప్రపంచమున మనము అనేకబాధలకు గురిఅవుతూ వుంటాము. వానిని అధిగమించుటకు భక్తి, ప్రేమ భావములే ముఖ్యము. దీనికి మూలము నా బాబాయే కదా!

(8) ఓ మనసా! ఊరక చలించి, అటునిటు తిరుగకుము. ఒక్కక్షణమైనను స్థిరముగా నిలువుము. నోరార సాయిని పిలువుము. ఇప్పటికెన్ని జన్మలు గతించినవో తెలియదు. **హఠాత్తుగా యీ రత్నం దొరికినందుకు, నా జన్మకు సార్థకత లభించినది.** ఓ బాబా సాయీ! నీ హస్తములు విశ్వమంతటను వ్యాపించి ఉన్నవి. అధిష్ఠానదేవుడవై నీవెంతగా శోభిస్తున్నావో గదా! నాకిట్టి మహత్తరమైన ఆనందమెప్పుడును లభించలేదయ్యా ! నా చేతులు జోడించి నిన్ను ప్రార్థిస్తున్నాను. నాపై దయజూపి, యీ దాసున కాప్తమిత్రుడవై, బంధువుగా ఆదుకోవయ్యా! నా మనసు ఏకాగ్రచిత్తముతో సాయిని భజియించుగాక !

(9) దీనులకు తల్లివైన సాయినాథా ! షిర్డీగ్రామమును నీవు ఆవాసంగా చేసుకొని, జనులలో సత్యదీక్షను, భక్తిని పెంపొదింపజేసినావు. మానవరూపంలో భౌతికదేహమును ధరించి, నీ లీలలను చూపుచుంటివి. సమయము దొరికినప్పుడల్లా సాయిని స్మరించినవాడే ధన్యుడు. నాకు బాబాపై మనసు లగ్నమగునట్లుగాను, సేవాభావము నా యందు కలుగునట్లును దయచేయమని కోరుచున్నాను.

(10) బాబా ! నీ భజనయను ఉత్సవము ఎంతో బాగుంది. ఒక్కసారి మా మధ్యకు రావా? వ్రాసే ప్రజ్ఞగాని, భాషగాని, స్తుతిగాని – అన్నియు నీవే.



నోటితో గానము చేయుట యీ దాసుని పని. **హృదయంలో నివసించే నిన్ను యీ అజ్ఞాని గుర్తించలేకున్నాడు.** ఓ మనసా ! సావధానచిత్తవై నిలిచి, ప్రేమతో సాయీ స్తవనం చేయి.

(11) సాయీ! నీ అద్భుత గుణములను గానం చేయాలని ప్రత్యేకించి, కఠినమైన కార్యాన్ని చేపట్టిన మహానుభావులెందరో ! వారిలో సఫలీకృతులెందరు? భక్తులు కాని వారిని కూడ నీ భక్తులుగా చేసుకొనగల సమర్థుడవు. ఓ దయానిధీ ! కొందరిచేత నామస్మరణ, మరి కొందరిచే నింబ వృక్ష ప్రదక్షిణలు చేయిస్తావు. మరికొందరివద్ద దక్షిణలు గైకొంటావు. కొందరిచే వ్యాపారం చేయిస్తావు; కొందరికి సంపదలిచ్చి, నీ దాసులుగా చేసుకొంటావు. నీ లీలలను అర్థము చేసుకొనగలవారెవరు? నీ వెవరిపై కరుణా రసమును కురిపించెదవో ఎవరి కెరుక ? నీ **చరణముల యందు నిజమైన భక్తిని కలిగించమని ఆశించు యీ భక్తురాలి కోరికను మన్నించు తండ్రీ !**

(12) ఓ దేవా ! ఎంత ప్రేమతో నీ గుణములను కీర్తించను ! నా మనసుకు శాంతి నీ చరణముల యందేనని తెలుసుకొంటిని. ఈ దేహమును కల్పించిన నీవే సర్వాధికారివి. నిన్ను మించి వేరెవరు కలరు? నీవు ప్రేమావతారునిగా అవతరించావు. కనుకనే సాధుసంతులు నిన్నే స్తుతించెదరు గదా !

(13) బాబా! అనాథనైన నన్ను తల్లివలె లాలించవా ప్రేమావతారా ? నీవు సత్సంగులైన యోగులను ఆదుకొనుచు, ప్రాణులను కూడా ఉద్ధరించుటకు నీ కీర్తి గానము చేయుచుందుము. మా జీవితములను కర్పూర హారతులుగా

నీకర్పింతుము. నీవు ఎందరో ఇండ్లకు వెళ్ళి వారిని ఉద్ధరించుటలేదా ? క్షణక్షణము నిన్నే స్మరింతుము.నీవే మా తల్లివి, తండ్రివి. నీ పదాబ్జములపై శిరస్సునుంచిన ఈ దీనురాలిని కరుణింప రమ్ము.

(14) సాయినాధుడను గురురత్నము మాకు లభించినది. మా జన్మములు సార్ధకములైనవి. బాబా! నీవు పుణ్యఫలములను మూట కట్టుకొనిన సిద్ధపురుషుడవు. చిదానందస్వరూపమైన దత్తావతారుడవు. భక్తుల మనస్సులందు నిలిచి వారి మనోరధములకు సిద్ధింపచేసి, నీవైపుకు మళ్ళించుకొందువు. బాబా నీవు గురువులకు గురుడవు.

(15) మశీదులు, దేవాలయములను భేదము లేక భక్తులు పరస్పర ప్రేమలతో ఆనందముగా, శాంతితో జీవించునట్లుగా చేయుచున్న మహానుభావా! దురాలోచన, దుష్టసంకల్పములు గలవారిని హితోక్తులతో వారించగల సాయీ ! ఈ దాసుడు సాష్టాంగనమస్కారముతో నిన్ను స్మరించి శరణువేడుచున్నాడు.

(16) త్రిభువనపాలకుడైన పరమేశ్వరుని క్షణమైనను మరువకుము. ఆ శ్రీహరియే నీకు రక్షకుడు. కాల చక్రగతి యందు అతడే స్వయంభువు, పాలకుడు. ఈ లోకములో మన మనుభవించు మమతానురాగాలు క్షణభంగురాలు. అందువలన నీవు శాశ్వతమైన బ్రహ్మతత్త్వమును తెలిసికొనుము. సాయి ప్రభూ! నీవే దిక్కని వచ్చిన ఈ దాసుని హృదయమునందు నివసించి నా మనస్సు ఈశ్వరుని యందే లగ్నమగునట్లుగా అనుగ్రహించుము.



(17) గురునామ రసాస్వాదనము సల్పు వాని కెదురుగా మృష్టాన్నములు కనిపించినను ఆ మానవుడు వాని జోలికి పోజాలడు. శాశ్వతానందము కొరకు ప్రయత్నించును. కోడికి కొన్ని గింజలు ఏరుకొని తినుట తప్ప రత్నములను గురించి ఏమి తెలియును? ఈ దాసుడు రత్నములను బోలు శ్రీగురునామస్మరణమును కలిగియుండుటకు మిమ్ము కోరుచున్నాడు.

(18) దేవదేవా ! నా తొలి కోర్కె నాలోని ద్వేషభావమును తొలగించుట, మలికోర్కె భూతదయను ప్రసాదించుట, మూడవ కోర్కె సత్యమునే పలుకునట్లును, మోహమున చిక్కుకొనకుండునట్లును నన్ను అనుగ్రహించుము.

(19) గురుభక్తిలేని జీవనము ఉన్నను, లేకున్నను ఒక్కటే. ఓ దేవా! ఈ జీవుని తరింపచేయుటకు నా ఆత్మయందు వసింపుము. తల్లి తన సంతానమును ప్రేమ, భయ, భక్తులతో ఎట్లు పోషించునో **అట్లే నా గురుదేవుడు సాయినాధుడు నన్ను పెంచి, పోషించుగాక !**

(20) మనమందరము ముక్తకంఠముతో సాయీశ్వరుని భజించి పిలిచెదము గాక! ఓ సాయీ! నీవు లేచి మా వద్దకురమ్ము. ఈ ఆసనము అలంకరించుము. నా శిరస్సును నీ పదముల మ్రోలనిలిపినాను. ఆప్తమిత్రుడవై నీ చరణరజమును శిరసున దాల్చిన నా ఆకలిని నీ ప్రేమామృతముతో నా దాహమును నివారించుము. (సశేషం)

# భక్తి యోగము

**శ్రీశంబాన నారాయణరావు,** డోర్ నెం.9-2/3, హాస్పటల్ రోడ్,
బొబ్బిలి - 535 558, విజయనగరం

**తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః॥ (19)**



(దూషణ, భూషణ పట్ల సమభావం కలిగినవాడు, మౌనంగా వుండేవాడు, దొరికిన దానితో సంతృప్తి చెందేవాడు, స్థిరనివాసం లేనివాడు, ధృఢనిశ్చయం కలిగినవాడు, భక్తి కలవాడగు మనుజుడు నాకు (భగవంతునకు) ఇష్టుడు)

1. ఎల్లప్పుడు మనస్సును మీ మీద నిలిపి భజించే భక్తులు ఉత్తములా? ఇంద్రియాలకు పట్టుపడని ఆత్మస్వరూపాన్ని ఆరాధించే భక్తులు ఉత్తములా? అని శ్రీకృష్ణుని అర్జునుడు అడుగుతాడు.

2. నాయందు (నా సహజ స్వరూప స్థితియందు) మనస్సు నిలిపి నిరంతరం నన్ను ఉపాసించు (ధ్యానించు) వారే ఉత్తములని అంటారు శ్రీకృష్ణుడు.

3. సాయి ఏమన్నారంటే...

తీర్థయాత్ర, వ్రతము, త్యాగము, దానముల కంటే తపస్సు చేయుట గొప్పది. హరిని పూజించుట తపస్సుకంటే మేలు. సద్గురుని ధ్యానించుట అన్నికంటే మేలు.





4. ఇంద్రియాలన్నింటిని అదుపులో వుంచి, సదా సమభావము కల్గి, సమస్త ప్రాణులను ప్రేమించుచూ, ఇంద్రియాలకు గోచరము కానిదియు, సర్వవ్యాపియూ, నిశ్చలము, శాశ్వతమైన ఆత్మ స్వరూపమును ధ్యానించువారు నన్నే పొందుచున్నారు అంటారు శ్రీకృష్ణుడు.

5. శరీరంపై అభిమానం కలవారు ఆత్మస్వరూపాన్ని ధ్యానించుటలో శ్రమ ఎక్కువ.

6. సమస్త కర్మలను నాకే అర్పించి, నన్నే దిక్కుగా భావించి, నాపై మనస్సు నిలిపి ధ్యానించే వాళ్ళను మరణమనే సంసారం నుండి మళ్ళిస్తాను అంటారు శ్రీకృష్ణుడు.

7. నాయందు మనస్సును నిలకడగా నిలుపలేని యెడల అభ్యాసయోగం అభ్యసించుము. అభ్యాసం చేయలేని యెడల, నాకు ప్రీతికరమైన కర్మలను చేయుము. అదీ చేయలేని యెడల నీకు నియమించబడిన కర్మల ఫలితాన్ని త్యాగం చేయుము. అంటే వివేకం లేని అభ్యాసం కంటే జ్ఞానం మేలు. శాస్త్ర జన్య జ్ఞానం కంటే ధ్యానం నయం. ధ్యానం కంటే కర్మఫలత్యాగం శ్రేష్ఠం. ఆ త్యాగం వలన తొందరగా మనశ్శాంతి లభిస్తుందని శ్రీకృష్ణుడు మనశ్శాంతికి మార్గం చెప్తాడు.

8. సమస్త ప్రాణుల యెడల స్నేహం, కరుణ కలవాడును, అహంకారం, మమకారములు లేనివాడూ, కష్టసుఖాలను సమానంగా భావించువాడూ, ఓర్పు కలవాడూ, సదాసంతృప్తి కలవాడూ, యోగ సాధనతో, మనోనిగ్రహంతో బుద్ధిని

నాకు సమర్పించువాడూ, తన వలన లోకము, లోకము వలన తానూ భయపడకుండా, సంతోషం, భయం,క్రోధం, మనోచాంచల్యం లేనివాడూ, కోరికలు లేనివాడూ, పవిత్రుడూ, కార్యసమర్ధుడూ, తటస్థుడూ, దిగులు లేనివాడూ, చీకుచింతా లేనివాడూ, శత్రువునందు, మిత్రునియందు సమానముగా నుండువాడూ, దేనియందును ఆసక్తి లేనివాడునూ, మౌనంతో నుండువాడూ, దొరికినదానితో తృప్తిని పొందువాడూ, గృహాదులు లేనివాడూ, దృఢనిశ్చయం కలవాడూ, శ్రద్ధతో నన్నే పరమగతిగా నమ్మి, నేను చెప్పిన ఈ ధర్మాన్ని పాటించేవాడూ నాకు ఇష్టుడని శ్రీకృష్ణుడు భక్తులు పాటించవలసిన ధర్మాన్ని ప్రబోధిస్తాడు.

9. బాబా తన భక్తులకు వుండవలసిన లక్షణాలను చెప్పిరి. వాటిలో కొన్ని...

10. "సమస్త ఇంద్రియములను, మనస్సును భగవంతుని ఆరాధన కొరకే నియమింపుము".

11. "మనస్సును, ధనసంపాదనకు, దేహపోషణ, గృహసంరక్షణము మొదలగు విషయములపట్ల సంచరించకుండా గట్టిగా నిలుపుము".

12. "ఇతరుల కొరకు మీరేమైనా చేయగలిగినచో ఎల్లప్పుడు మేలు మాత్రమే చేయుడు".

13. "ఉన్నదానితో సంతుష్టి చెందవలెను".

14. "అన్ని జీవులను ప్రేమించవలెను".

15. "ఎవరైతే యితరులను నిందించెదరో, వారు నన్ను హింసించిన వారగుదురు".

16. "ఎవరైతే బాధలను భరించెదరో, ఓర్చుకొందురో వారు నాకు ప్రీతి గూర్చెదరు".



17. "దైవాన్ని స్మరిస్తూ అహాన్ని చంపుకో".

18. "సహనమునకు మించిన సంపద సృష్టిలో లేదు".

19. బాబా తన భక్తులకు ధనమందు ఆసక్తి లేకుండా చేసెడివారు. బాబా ముఖ్య భక్తులలో భక్త మహల్సాపతి ఒకరు. ఆయన మిక్కిలి పేదవాడు. అయినను అతడు ధనమును ఆర్జించుటకు బాబా ఒప్పుకోలేదు. దక్షిణలో నుండి కూడా ఏమియు ఈయలేదు. బాబా భక్తుడగు హంసరాజు బాబా ఎదుట మహల్సాపతికి చాలా డబ్బు యిచ్చెను. కాని బాబా దానిని పుచ్చుకొనుటకు అనుమతించలేదు. ఎందుకంటే బీదవానికి దగ్గరగా భగవంతుడుంటాడు. ఇక్కడ బీదవాడు మహల్సాపతి, భగవంతుడు బాబా. దొరికిన దానితో తృప్తి పడమని గీత చెప్పినదానిని, మహల్సాపతిచే ఆచరణలో పెట్టించారు బాబా.


20. ఇంద్రియాలను అదుపులో లేకపోతే భక్తి కుదరదు. తీర్థయాత్రలకు, దేవాలయాలకు, వెళ్ళేటప్పుడు అక్కడ అందమైన వారు కనిపించగానే మనస్సున క్షణికమైన కోరిక జనిస్తే, తీర్థయాత్ర, దేవాలయ దర్శనము వ్యర్థమవుతుంది. కావున ఇంద్రియ నిగ్రహం కలిగిన నాడే భగవంతునిపై భక్తి బలపడుతుంది. అందుకే బాబా అంటారు "ఎవరి మనస్సు స్వాధీనమందున్నదో, ఎవరి ఇంద్రియములు స్వాధీనమందుండునో, ఎవడు తన బుద్ధిని మార్గదర్శిగా గ్రహించి తన మనస్సును పగ్గముతో లాగి పట్టుకొనగలడో వాడు తన గమ్యస్థానమును చేరగలడు. విష్ణుపదమును చేరగలడు".

సద్గురు శ్రీసాయి పాదుకార్పిత మస్తు

శుభం భవతు

# గురూపదేశం

**–రావూజీ**



పలురకాల వ్యక్తుల క్రమానుగత స్థాయిల ననుసరించి వారి మనస్తత్త్వాల ననుసరించి గురుభావం మారుతుంది. సామాన్యమైన గురువు మొదలు మహోన్నత భావ శిఖరాగ్రాల నధిరోహించిన శ్రీదక్షిణామూర్తి గురువు వరకు గురువను పదమునందుగల భావం వివిధ రీతులలో మారుతుంటుంది.

**నిర్మల భక్తులు సాధనలలో సాయం చేయడానికి సంసిద్ధపడే సద్గురువులలో షిర్డిసాయిబాబా గణనీయులు.** పూజనీయులు శ్రీసాయి తన విజ్ఞాన ప్రదమైన జీవనం ద్వారా, తన ఆచరణాత్మక బోధనల ద్వారా ఆధ్యాత్మిక జీవనరంగంలో నిశ్చలభక్తి ప్రాధాన్యాన్ని, సద్గురువు యొక్క ప్రభావాలను గూర్చి వక్కాణించారు.

ఒక గురువు సాన్నిధ్యం నుండి మరొక గురువు సాన్నిధ్యానికి మార్పిడి చేసుకొనువారిని చూచినప్పుడల్లా బాధాకరంగా ఉండేది.

శ్రీసాయి తన భక్తులతో ఇలా అన్నారు, "సిగ్గుపడక అచంచల విశ్వాసంతో మీరు నమ్మిన గురువును వదలక మనసారా ఆరాధన చేయండి. ఇతర గురువుల ఉత్కృష్టతను గూర్చి ఆలోచించకండి. మన గురువు సాన్నిధ్యాన్ని నిరంతరం వదలక, పట్టు విడవక వారిలోనే (వారి బోధనలోనే) లీనం కండి.

శ్రీసాయి తన గురువు మహిమను గూర్చి ఇలా అన్నారు. "నేను సద్గురు సేవ 12 సంవత్సరాలు చేశాను. వారికి నాపైగల అవ్యాజ ప్రేమను గూర్చి నేనేమి చెప్పగలను? నిశ్చేష్టుడనై నేను వారిని చూచాను. మేమిద్దరం పరమానందాన్ని పొందాము. నేను ఇంక దేనిని లెక్కచేయను. ఆకలి దప్పులను కూడా మరచి అత్యంత ప్రేమతో వారిని దర్శింపసాగాను. ఒక క్షణం కూడా గురుసన్నిధిని వీడి ఉండలేకపోయేవాడను. నా నేత్రాలు ఎల్లప్పుడూ గురు వర్చస్సుపై కేంద్రీకరింప బడుతున్నందున నాకు గురువు తప్ప మరెవ్వరూ కనపడలేదు. నా గురువు నుండి నేనేమీ కోరడం లేదు. వారెన్నడూ నన్ను అశ్రద్ధ చేయక తమ కరుణామృత వర్షంతో పులకరింపజేశారు. గురుదేవులు నాకెట్టి మంత్రోపదేశం చేయలేదు. వారి కరుణా కటాక్షవీక్షణం వలననే నేనింత వాడనయ్యాను. సద్గురువు చింతనయే పరమాత్ముని చేరడానికి దోహదమవుతుంది. తన తలంపులన్నీ సద్గురు మహిమలపై కేంద్రీకరింపజేయాలి. ఇదే నా గురువు బోధించిన పరమ సత్యం. సంపూర్ణంగా గురువుపై అచంచల విశ్వాసం కలిగి వుండడం అనుసరణీయం, ఆచరణీయం."

భక్తుని మనసు నిరంతరానందాబ్ధిలో ఎలా తేలియాడుతూ ఉండాలో శ్రీసాయి సూక్తులు స్పష్టపరుస్తున్నాయి. ఇలా మానవునిలోని దైవత్వాన్ని, తనలోని దివ్యత్వాన్ని వెలుగులోకి తెచ్చినది శ్రీసాయియొక్క మౌనముద్రయే. హృదయపూర్వకములైన అత్యంత ప్రేమానురాగ, మౌన ధ్యాన విశిష్టతలే. ఇదే ఆధ్యాత్మిక సాధకుని జీవనరంగంలో సద్గురువు వహిస్తున్న ప్రధానపాత్ర, సద్గురువు భక్తుని యోగక్షేమాలకు, బాధ్యత వహించగలదు. గురుదేవుని స్వర్గధామంలో శిష్యుల శ్రేయస్సు భద్రంగా ఉంటుంది.

శ్రీసాయి ఇలా అన్నారు, "నన్ను మనసారా అపారప్రేమతో దర్శించు

వారెక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా వారి రక్షణ భారం నాపై ఉంటుంది. మీరు నన్ను హృదయపూర్వకంగా తలచిన మరుక్షణం నుండి నేనెప్పుడూ మీతోనే ఉంటాను. మీరు నన్ను చిత్తైక్రాగతతో ధ్యానిస్తే నేను మీ సరసనే ఉంటాను. మీరు నన్ను స్మరించి మీ సర్వస్వం నా కర్పణ చేస్తే నేను సర్వదా మీ బానిసను. మీ అంతరంగాన, బహిరంగాన మీతో నేనుంటాను. నేను భక్త పరాధీనుడను. లెక్కలేనంత మంది గురువులుంటారు. వారు జనులను పట్టి బలవంతాన తెచ్చి శిష్యులను చేసుకుంటారు. డబ్బుకోసం మోసం చేసి బలవంతంగా చెవుల్లో మంత్రాన్నూదుతారు. శిష్యులకు ధర్మబద్ధంగా జీవించాలని నేర్పిస్తారు. కానీ తాము మాత్రం అధర్మానాశ్రయించుకొని బతికేస్తారు. తామే దాటలేని భవసాగరాన్ని అలాంటి గురువులు శిష్యులనెలా దాటిస్తారు! తామే తప్పించుకోలేని జనన మరణాలనుంచి శిష్యులనెలా తప్పిస్తారు! తమ ధార్మికత్వం ప్రాచుర్యం పొందాలని, జగత్తులో తమ జండాలు మెండుగా ఎగరాలనే మనస్తత్వం మచ్చుకైనా లేని మహనీయ తత్త్వం సాయి.

అదృష్టవశాత్తు మహాత్ముల దర్శనం అయితే అదే వ్యాధికి ఒక ఉపశమనం. వ్యాధిగ్రస్తులు అప్పుడు వ్యాధిని దుఃఖం లేకుండా సహజంగా సహిస్తారు. వ్యాధి దారుణమైన బాధను అనుభవింపచేస్తుంది. సత్పురుషులు, తమ కరుణ జాలు వారే దృష్టిని ప్రచురింపచేసి దుఃఖం లేకుండా అనుభవింపజేసి వాటిని నివారిస్తారు.

సద్గురువు లేదా సత్పురుషులు తమ దైవీశక్తిని ఉపయోగించి భక్తులు దుఃఖాలనన్నింటిని కలిపి ఒకేసారిగా అనుభవింపజేసి వారిని వెంటనే వాటినుంచి విడుదల చేస్తారు లేదా ఆ దుఃఖాన్ని తాము తమ మీదకు తీసుకొని ఆ భక్తులను విడుదల చేస్తారు. □




# పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ !

## మహాభక్త భగత్ మహల్సాపతి జీవిత చరిత్ర

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా

(గత సంచిక తరువాయి భాగం)



ఒకరాత్రి మహల్సాపతితో బాబా, "అరే భగత్! ఆ దుష్ట రోహిల్లా (ప్లేగు మహమ్మారి) నిగోజీ పాటిల్ భార్యను కబళించాలని చూస్తుంది. దానిని ఆపడానికి ఈ రాత్రంతా అల్లా ధ్యానంలో ఉంటాను. నా ధ్యానం భంగపరచకుండా జాగ్రత్తపడు" అనిచెప్పి అతనిని వాకిలి దగ్గర కాపాలాగా ఉంచారు. మహల్సాపతి బాబాకు ధ్యానభంగం కలగకుండ జాగరూకతతోఉన్నాడు. దురదృష్టవశాత్తు అర్ధరాత్రి సమయంలో నివాసీమమల్తాదారు మశీదుకొచ్చాడు. అతడు, అతని అనుచరులు బాబాను దర్శించాలని పట్టుబట్టారు. బాబా ధ్యానంలో ఉన్నారని అప్పుడు దర్శించడం వీలుపడదని, ఉదయం రమ్మని వాళ్లకు మహల్సాపతి వినయంగా చెప్పాడు. కానీ వారు అధికార దర్పంతో అప్పుడే దర్శించాలని పెద్దగా అరుస్తూ గొడవకు దిగారు. దీనివలన బాబాకు ధ్యానభంగమయింది. బాబా లేచి కూర్చుని "నీవలన ఆ నిగోజీ భార్య చనిపోయింది కదా !" అంటూ తిట్టడం ప్రారంభించారు. బాబాకు ధ్యానభంగమైన సమయంలో ప్లేగుతో బాధపడుతున్న నిగోజీభార్య చనిపోయింది. ఉదయం ఆమెను

స్మశానానికి తీసుకువెళుతున్నారు. ఇది చూచి మహల్సాపతి, ఆ నివాసీ మమల్తదారు రాకుంటే ఈమె బ్రతికి ఉండేది కదా అని చింతించాడు.

బాబా మహల్సాపతిని, అతని కుటుంబాన్ని సర్వదా కాపాడుతూ వచ్చారు. భవిష్యత్తులో జరగబోయే ఆపదలను గూర్చి ముందే హెచ్చరించడమే గాకుండా ఆ యా ఆపదలనుండి కాపాడి రక్షించేవారు. అప్పుడు శిరిడీలో పాముల బెడద ఎక్కువగా ఉండేది. బాబా పాములను, పొడుగాటి పెద్ద మనుష్యులతోనూ దొంగలతోనూ పోల్చి చెప్పేవారు. ఒకసారి మహల్సాపతి మశీదు నుండి ఇంటికి వెళుతున్నప్పుడు బాబా "నీకు దారిలో ఇద్దరు దొంగలు తటస్థపడతారు" అని చెప్పారు. అలాగే తన ఇంటి ముంగిట ఒక పాము పొరుగింటి ఆవరణలో మరొకపాము కనిపించాయి. మరొక సాయంత్రం తను ఇంటికి బయలుదేరుతున్నప్పుడు, "నీవు రాత్రి ఇక్కడకు వచ్చేటప్పుడు లాంతరు తీసుకురావాలి. ఎందుకంటే నీ ఇంటి గేటు దగ్గర దొంగొకడు పొంచి ఉంటాడు" అని చెప్పారు. బాబా మాట ప్రకారం రాత్రి లాంతరు తీసుకొని మశీదుకు బయలుదేరాడు మహల్సాపతి. తన గేటుకడ్డంగా పామొకటి పడుకుని ఉంది. అతను "పాము, పాము" అని అరిచాడు. ఇరుగు పొరుగువాళ్ళు వచ్చి దానిని కొట్టి చంపేశారు. లైటు తీసుకొని రాకుంటే పామును చూడకుండ దానిపై కాలువేసి దాని కాటుకు గురయ్యేవాడు మహల్సాపతి.

మరొకసారి బాబా మహల్సాపతితో "నీ వీపును ఎప్పుడూ నేలకు ఆనించకుండా చూచుకో! " అని చెప్పారు. మహల్సాపతి ఈ విషయం మరచి ఒకసారి బర్ఫీ ఎక్కువ తిని, కళ్లు బైర్లు కమ్మినట్లై వెనక్కు వాలిపోయాడు.



ఫలితంగా తన వీపు నేలకు ఆనింది. స్పర్శ కోల్పోయాడు. కాసేపటికి స్పృహ వచ్చి, లేవడానికి ప్రయత్నించాడు. కానీ కాళ్ళు, నడుము పట్టినట్లై లేవలేకపోయాడు. తన కూతుర్లు, కాళ్ళు, నడుము బాగా మర్దనచేసి బాబా దగ్గరకు తీసుకువెళ్ళారు. బాబా అతనిని చూస్తూనే "నేను ముందే చెప్పాను కదా ? నీ వీపును నేలకు ఆనించిన ఫలితమే ఇది !" అని మందలించారు. తర్వాత వారి ఆశీర్వాదంతో మహల్సాపతి కోలుకున్నాడు.

మరొకసారి బాబా "ఖండోబా ఇంటిలో (మహల్సాపతి ఇంటిని ఖండొబా ఇల్లని వ్యవహరించడం బాబా అలవాటు) కొన్ని ఆపదలు చోటు చేసుకోబోతున్నాయి !" అన్నారు. ఈ మాటలు పలికిన కొన్ని రోజులకు, తన భార్య, ముగ్గురు కూతుర్లు ఏదో తెలియని జబ్బుతో మంచాన పడ్డారు. అప్పుడు బాబాను దర్శించడానికి వచ్చిన భక్తులలో చాలామంది డాక్టర్లు కూడా ఉండేవారు. వారు వీరి పరిస్థితి గమనించి మందులేవో ఇచ్చి వాడమని చెప్పారు. మహల్సాపతి వాటిని తీసుకొని బాబా దగ్గరకు వెళ్ళి వారి సలహా అడిగారు. బాబా మందులేవీ వాడనక్కరలేదని తాము వారిని బాగుచేస్తామని చెప్పారు. వారు చేసిన వినూత్నచికిత్స ఏమిటో తెలుసా? జబ్బుపడినవారిని మంచాలమీదే కదలకుండ పడుకుని ఉండమని ఆదేశించారు. తర్వాత తమ దండం చేతబట్టుకొని, దానిని ఝుళిపిస్తూ, "మీ శక్తులేవో మీరు చూపించారు. ధైర్యముంటే ముందుకు రండి. నా పొట్టి దండం యొక్క శక్తి ఏమిటో మీకు రుచి చూపిస్తాను. వెళ్లండి, వెళ్ళండి!" అంటూ గట్టిగా అరుస్తూ మశీదు చుట్టూ మూడుసార్లు తిరిగారు. అంతే ! వారికి రోగాలు మాయమై ఆరోగ్యవంతులయ్యారు. బాబాకు భయపడి రోగాలన్నీ పారిపోయాయి.

(ఇంకా ఉంది)



# సాయినాథ ఉవాచ


సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు

**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా


*(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి)*

*(గత సంచిక తరువాయి భాగము)*

***(271)*** **నా ప్రీతికోసమే నీవు ఉపవాసమున్నావా? అయితే, నేనే చెబుతున్నాను. వెళ్ళి భోంచేసిరా !**

ప్రధాన్ అను భక్తుడు శిరిడీలో ఒక విందును ఏర్పాటుచేశాడు. బాలాభాటే అను మరొక భక్తుడు విందుకెళ్ళకుండ మశీదుకు వచ్చి, బాబా ముందు కూర్చున్నాడు. "ప్రధాన్ విందుకెళ్ళి భోంచేసి వచ్చావా?" అని బాబా అడిగారు. భాటే "ఈ రోజు గురువారం బాబా !" అన్నాడు. "అయితే ఏమిటట?" అని బాబా ప్రశ్నించాడు. తను గురువారాలు ఉపవాసముంటున్నట్లు భాటే చెప్పాడు. "ఎవరి ప్రీతికోసం ఉపవాసముంటున్నా"వని బాబా అడిగారు. బాబా ప్రీతికోసమే నని భాటే జవాబు యిచ్చాడు. అప్పుడు బాబా "అయితే నేనే చెబుతున్నాను. వెళ్ళి భోంచేసిరా !" అని ఆదేశించారు. భాటే వెళ్లి భోంచేసి వచ్చాడు. దీనిని బట్టి ఉపవాసాలను ఛాందసాచారాలుగా బాబా జమకట్టేవారని మనకు తెలుస్తుంది.



***(272) "అయితే ఇంటికెళ్లి నీకున్నదంతా పట్టుకొచ్చి నాకిచ్చేయ్!"***

***(273) "చూశారా ! ఇతడు మకిలపట్టిన నాణాన్ని ఏరి నాకిచ్చాడు !"***

ఉపాసనీబాబా ఒకసారి తనదగ్గరున్న రూపాయినాణాలలో మకిలిపట్టిన నాణాన్ని ఏరి, బాబాకు దక్షిణగా సమర్పించారు. బాబా ఆ నాణాన్ని ఏరి అక్కడున్న భక్తులకు చూపిస్తూ "చూశారా ! ఇతడు మకిలిపట్టిన నాణాన్ని ఏరి నాకు సమర్పించాడు" అని అన్నారు. అక్కడున్న భక్తులందరూ ఫక్కున నవ్వారు. ఉపాసని సిగ్గుపడి వేరొక రూపాయినాణెం ఇస్తానన్నాడు. కానీ బాబా అక్కరలేదని చెప్పాడు. ఆ సమయంలో హరిభావు చౌబాల్ అనుభక్తుడు వచ్చి సాయికి రూపాయల కట్టనొకదానిని దక్షిణగా సమర్పించాడు. బాబా ఇంకా యివ్వమని కోరారు. చౌబాల్ తనదగ్గర డబ్బేమీ లేదని చెప్పాడు. "అయితే ఇంటికివెళ్ళి నీ కున్నంతా తెచ్చి నాకిచ్చేయ్" అన్నారు బాబా. తనకున్నదంతా సమర్పించే గొప్ప అవకాశం బాబా కల్పించినందులకు సంతోషించి ఇంటికెళ్ళాడు. రూపాయి ఇవ్వడానికే సంకోచించి, మకిలపట్టిన నాణాన్ని ఏరి బాబా కిచ్చిన ఉపాసని, ఈ సంఘటన చూచి అవమానభారంతో కృంగిపోయాడు.

***(274) "భక్తులడిగినవన్ని ఇస్తూనే ఉంటాను - నేను వారికివ్వ దలచింది వారడిగేంతవరకు !"***

ద్వారకామాయిలో ఒక భక్తుడు, మరొక భక్తుడితో, బాబాను తుచ్ఛమైన ప్రాపంచిక కోరికలు కోరడం తప్పని చెబుతూన్నాడు బాబా అతనిని వారించి "అలా చెప్పవద్దు. నాదగ్గరికి వచ్చే భక్తులందరూ, సంతానం, సంపద, ఆరోగ్యము మొదలైన ప్రాపంచిక కోరికల నాశించి మాత్రమే వస్తూంటారు. నేను వారడిగిన కోరికలన్నీ నెరవేరుస్తూ ఉంటాను. నేను వారి కివ్వదలచింది వారడిగేంతవరకు" అన్నారు. బాబా భక్తుల కివ్వదలచింది ఆధ్యాత్మిక సంపద!' అది ఆధ్యాత్మికత అలవడిలో భక్తులు కోరదగినవే ఇక మిగిలినవి కూడా అని దీనిభావం.

***(275) "నీవు ఎవరిని నిందించినా, లేక వారి తప్పులెంచినా, ఆ క్షణమే నాకు బాధ కలుగుతుంది".***

ఒకసారి దీక్షిత్ ఏసుక్రీస్తుని నిందించువారితో జత కలసి, వారిని ప్రోత్సహించాడు. ఆ రోజు సాయంత్రం దీక్షిత్ మశీదు వెళ్లి, బాబా ముందు కూర్చుని వారి పాదాలొత్తబోయాడు. బాబా చాచివున్న పాదాలను వెనక్కి ముడుచుకున్నాడు. అంటే అతని సేవను నిరాకరించారు. బాబా ఇలా ఎందుకు చేశారో, తనపై ఎందుకు కోపం ప్రదర్శిస్తున్నారో దీక్షిత్‌కు అర్థంకాలేదు. చాలాసేపు ఆలోచించిన మీదట, ఉదయం తన ప్రవర్తన గుర్తుకొచ్చింది. ఏసుక్రీస్తును నిందించిన వారిలో జత కలిసిన ఫలితమే అదని తెలుసుకున్నాడు. క్షమించిమని మనస్సులోనే బాబాను ప్రార్థించాడు. మరుక్షణమే బాబా తన పాదాలను ముందుకు చాచి, దీక్షిత్‌సేవ అంగీకరించి, "నీవు ఎవరినైనా నిందించినా లేక వారి తప్పులెంచిన, ఆ క్షణమే నాకు బాధ కలుగుతుంది" అని అన్నారు.



***(276) "క్రైస్తవుదైన నేమి? అతడు నా సోదరుడు !"***

కోపర్‌గావ్‌లో చక్రనారాయన్ అనువానిని పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారని, అతడు క్రైస్తవుడని భక్తులు బాబాతో చెప్పారు. అప్పుడు బాబా "క్రైస్తదు డైన నేమి? అతడు నా సోదరుడు" అని చెప్పారు. బాబా సమక్షంలో మత ప్రసక్తి తెచ్చినందుకు భక్తులు చింతపడ్డారు. బాబాకు సర్వమతాలు ఒక్కటే !

***(277) "మితంగా తిను ! రకరకాల రుచులకు పోవద్దు. భోజనంలో ఒక్కకూర చాలు".***

***(278) "నిన్ను దాట నిచ్చాను. మట్టిని బంగారం చేశాను. ఎంత పెద్ద భవనాన్ని కట్టానో !"***

రాత్రిళ్ళు మశీదులో అబ్దుల్‌కు బాబా ఖురాను బోధించడమేగాక, వివిధ సలహాలనిస్తూండేవారు. రాత్రిళ్ళు నిద్రపోకుండా అల్లా నామం స్మరిస్తూ గడపాలని చెప్పేవారు. అతిగా నిద్రపోకూడదని, మితంగా భోంచేయాలని, రకరకాల రుచులకు పోకుండ, అన్నంలో ఒక్క కూరతోనే భోంచేయడం అలవాటు చేసుకోవాలని చెప్పేవారు. ఒక్కొక్కసారి అబ్దుల్‌ను బాబా తిట్టేవారు. ఆ తిట్లలో ఆశీర్వాదాలు దాగి ఉండేవి. అబ్దుల్ కూడా ఆ తిట్లను ఆశీర్వాదాలుగానే తీసుకునేవారు. ఉదాహరణకు :- "నిన్ను దాటనిచ్చాను. నీ మట్టిని బంగారం చేశాను. ఎంత పెద్ద భవనాన్ని కట్టానో" అనేవారు. అంటే అబ్దుల్ సంసార సాగరాన్ని దాటడానికి అవకాశం కల్పించానని, అతని మట్టి శరీరాన్ని బంగారం

చేశానని, అతని శరీరాన్ని పెద్ద సుందర భవనంగా రూపొందించానని బాబా చెప్పేవారు.

**(279) *"కోపం దేనికి? నెమ్మదిగా చెప్పవచ్చు కదా !"***

బాబా ఎప్పుడూ బాపూ సాహెబ్ జోగ్‌ను రెండు రూపాయల దక్షిణ అడిగేవారు. జోగ్ లేదని చెప్పేవాడు. ఒకసారి ఇలా దక్షిణ అడిగినప్పుడు జోగ్ కోపంతో "లేదని ఎన్నిమార్లు చెప్పినా, మళ్లీ మళ్లీ అడుగుతుంటారెందుకు?" అని రెట్టించాడు. అప్పుడు బాబా సహనం అలవరచుకోవాలని, ఊరికే కోప పడకూడదని పైమాటలలో చెప్పారు.

**(280) *"ఈ రోజు చస్తే రేపు చిన్నదినం వస్తుంది. ఈ ఇళ్లు, వాకిళ్ళు, పొలాలు, పుత్రులు మనకేం పనికివస్తాయి?"***

విజేపూర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా అనువాడు బాబాను దర్శించాడు. బాబా వైరాగ్య ధోరణిలో పై మాటలు అన్నారు. సంసారం, ఆస్తులు శాశ్వతం కాదని, చనిపోయినవారిని ప్రజలు త్వరలోనే మరచిపోతారని, అంతమాత్రానికి, వారు ఆస్తులు, మమతానుబంధాలు పెంచుకోవడం వృధా అని బాబా చెప్పారు. ఈ మాటలు అబ్దుల్లాపై విపరీత ప్రభావం చూపాయి. తీవ్ర విరక్తిభావం పొడసూపింది. సంసారం, ఆస్తులు అన్నీ వదిలేసి, పిచ్చివానివలె తిరగడం ప్రారంభించాడు. స్మశానంలో పడుకునేవాడు. ఎవరైనా పెడితే తినేవాడు లేదా ఊరికే గడిపేవాడు. కానీ కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత అతనికి కొన్ని అతీత శక్తులు లభించాయి.



**(281) *"మమల్తాదారు అనుమతి తీసుకోకుండా ఎందుకొచ్చావ్? అలా ఎప్పుడూ చేయవద్దు".***

శాంతారాం బల్వంత్ నాచ్నే దహనులో మమల్తదారు వద్ద గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాడు. 1912లో మొదటిసారిగా తన స్నేహితులతో కలిసి శిరిడీ వెళ్ళాడు. బాబా లెండీ తోట నుండి మశీదుకు వస్తున్నారు. నాచ్నేను చూసి "ఏమిటి ! నీవు మమల్తదారు అనుమతి తీసుకోకుండా వచ్చావా?" అని అడిగాడు. నాచ్నే అవునని జవాబిచ్చాడు. "అలా ఎప్పుడూ చేయవద్దు" అని మందలించారు బాబా. నాచ్నే బాబా యొక్క సర్వజ్ఞతకు ఆశ్చర్యపోయాడు. (ఇంకా ఉంది)


## శ్రీసాయి ప్రచార ప్రతినిధులు కావాలి

**శ్రీసాయిదర్శన్, శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్ట్ తరుఫున మీ గ్రామములో / మీ పట్టణములో నిస్వార్థసేవ చేయగల మహనీయులు కావలెను. వివరములకు ఈ దిగువ అడ్రసుకు వ్రాయండి.**

**SRI SAI DARSHAN CHARITABLE TRUST**
**Dammaiguda ,**
**Hyderabad - 500 083**
**Phone : 040-65640220**
**Cell : 98667 48099**

# సద్గురువుపై విశ్వాసం

- రావూజీ

విశ్వాసముంటే జగన్నివాసునిపై మనస్సును మరలించే స్థితి, అనుభూతి, అనంతుని కరుణామృతరసాన్ని గ్రోలి రక్షణ పొందటానికి తపన చెందు భక్తిపూర్వక శరణాగతియే విశ్వాసం. భగవానుని సాయుజ్యాన్ని పొందటానికి శ్రద్ధాభక్తులతో గూడిన విధానానికి శ్రీసాయి మిక్కిలి ప్రాముఖ్యం ఇచ్చారు. విగ్రహాలు, ప్రతిమలను, పటములను, పాదుకలను మొదలగు వానిని ఆరాధించుటలో దోషములేదని వాదించారు. చిత్తైకాగ్రతకు నిశ్చల ధ్యాన లబ్ధికి ఇవి సాధనాలు మాత్రమే. జ్ఞాన సముపార్జనకు, అచంచల విశ్వాసం, సద్గురుని ఆరాధన దోహదం చేయగలవు.

భయంకర దుర్గమారణ్యాన్ని దాటాలంటే, జ్ఞాన సముపార్జన సాధించాలంటే గురువుపై విశ్వాసముంచి ధ్యానం చేయడమే ఉత్తమ మార్గము. గురువునందు సంపూర్ణవినయం, అచంచల విశ్వాసం కలిగి ఉండటం సద్భక్తుని ప్రధాన లక్షణాలు.

శ్రీసాయి ఇలా అన్నారు. "ఇతర గురువుల మహిమలెంత మహోన్నతములైనను అచంచల భక్తి విశ్వాసాలతో మీరు ఎన్నుకున్న సద్గురువును వీడకండి. ఎల్లవేళలా ఆశ్రయించండి. వారియందు పరిపూర్ణ విశ్వాసముంచి మన సద్గురువు బాంధవ్యాన్ని మనమెన్నడూ వదలరాదు."

□




# శ్రీసాయిబాబా జన్మరహస్యం

సాయిదాసానుదాసు సురేంద్రబాబు, కొవ్వూరు, నెల్లూరు జిల్లా

**ఇతర చరిత్రకారులు రూపకల్పన చేసిన కథలు**

### శ్రీ సాయిశరణానంద స్వామి చెప్పిన కథ



ఇంతవరకు చెప్పిన కథలు బాబా వాచా వెలువడిన రెండు, మూడు మాటలు తప్ప మరి ఏ ఆధారాలు లేవు. కాని శ్రీ శరణానందస్వామి చెప్పిన దిగువ కథకు ఎన్నో ఆధారాలు, ఋజువులు లభించాయి. అందుకే దీనిని వాస్తవమైనదిగా పలువురు పేర్కొన్నారు. ఇది బహుళ ప్రచారంలో ఉంది కూడా !

మొదట శరణానందస్వామికి బాబా బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారనే నమ్మకం ఒకటి ఉండేది. ఎవరైనా బాబా బ్రాహ్మణులు కాదని ఖండిస్తే, బాబా కోపోద్రేకంతో అశాంతచిత్తులు కావడం శరణానంద ఎన్నోసార్లు గమనించాడు. ఒకసారి 1912లో శరణానంద బాబాను దర్శించినప్పుడు తన తండ్రి వాపుతెవులు (డ్రాప్సీ) వ్యాధితో బాధపడుతున్నాడు. తన తండ్రి బాబా వద్దకు తీసికొనివచ్చి ఉంటే బాగుండేది కదా అని మనస్సులో అనుకున్నాడు. బాబా వెంటనే అతని మనస్సు కనిపెట్టి, "మరి ఎందుకు తీసుకురాలేదు" అని ప్రశ్నించారు. "మహమ్మదీయుడైన బాబా వద్దకు రావడానికి తన తండ్రి అంగీకరిస్తాడో లేదో" అని తలచాడు, వెంటనే బాబా, 'నేను బ్రాహ్మణుడను కానా?" అని ప్రశ్నించారు. దీనితో బాబా బ్రాహ్మణులని, శరణానంద దృఢపరచుకున్నాడు. ఒక సందర్భంలో బాబా, మహల్సాపతితో తమ తలిదండ్రులు పత్రీకి చెందిన

యజుర్వేద బ్రాహ్మణులని చెప్పడం, మరో సందర్భంలో "నేను స్వచ్ఛమైన బ్రాహ్మణుడను. ఈ బ్రాహ్మణుడు లక్షలాది ప్రజలను శుభ్రమార్గంలో నడిపించి, వారిని గమ్యం చేర్చగలడు. ఇది బ్రాహ్మణమశీదు" అని చెప్పడం, మరోసారి పత్రికి చెందిన భక్తుడొకడు బాబాను దర్శించినప్పుడు అతనిని అప్పుడు పత్రీలో నివసిస్తున్న కొందరు పెద్దమనుష్యుల యోగక్షేమాలు పేరుపేరునా పరామర్శించడం, మొదలైనవన్నీ బాబా పత్రీకి చెందిన యజుర్వేదీయ బ్రాహ్మణుడని నమ్మకానికి దోహదపడ్డాయి. మరోసారి శరణానంద, మహల్సాపతి బాబా సన్నిధిలో ఉన్నప్పుడు, "పత్రీనుండి వెళ్ళు దారి చాలా కఠినమైనది. పత్రీ నుండి మానవత్, సేలూ, జాల్నా దాటుకుంటూ వెళ్ళి పైథాన్, ఔరంగాబాద్ చేరాలి. నేనొకసారి ఈ మార్గం గుండా ప్రయాణించాను. ఎనిమిది రోజులు పట్టింది. రోజంతా కాలినడకన ప్రయాణం, రాత్రి పచ్చిక మీదే పడక!" అన్నారు. అంటే వారొకప్పుడు ఆ మార్గంలో గురువు వెంట ప్రయాణించినట్లు స్పష్టంగా చెప్పినట్లే కదా ! అంతేకాక శరణానంద స్వామితో బాబా, స్వయంగా తమ గురువు పేరు రోషన్ షా మియా అని చెప్పడం, తరచు, తమ సంభాషణలో పత్రీ, మానవత్, సేలూ. జాల్నాపూర్, ఔరంగాబాద్ పేర్లూ వస్తూ ఉండడం మొదలైనవన్నీ, బాబా పత్రీకి చెందిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఒక ముస్లిం గురువుచే జ్ఞానిగా రూపొందించబడ్డారని, అనుకోవడానికి శరణానందకు తోడ్పడ్డాయి. అందుకే బాబా జన్మవృత్తాంతం క్రింది విధంగా చెప్పాడు.

పత్రి అను గ్రామం మహారాష్ట్రలో, మరట్వాడా ప్రాంతంలో, మానవత్‌కు 5 మైళ్ళ దూరంలో ఉంది. పత్రీలోని ఒక యజుర్వేద దేశస్థ బ్రాహ్మణునికి ముగ్గురు కుమారులున్నారు. పెద్దవాడే సాయిబాబా.

(సశేషం)



# సద్గురువు ప్రభావము


– రావూజీ

గురువే బ్రహ్మ స్వరూపుడు. గురువే మహేశ్వరుడు అని వేదాలు, ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. గురువు యొక్క కరుణాకటాక్ష వీక్షణ ద్వారా శిష్యుడు వివిధములైన అసామాన్యములైన ప్రయోజనాలను పొంది విజ్ఞానవంతుడై రాణిస్తాడు. సద్గురువు మహిమ ఎంత గొప్పది? షిర్డి సాయిబాబా నేటి సద్గురువులలో మేటి. గురువు యొక్క మహిమాన్విత కటాక్షం వలననే అధ్యాత్మిక సాధన, గురువుయెడల విశ్వాసం సాధ్యమౌతుందని, అదే అత్యవసరమని వారనేకసార్లు సెలవిచ్చారు. గురువులను తరచు మార్చడం పనికిరాదని తన శిష్యులను శ్రీసాయి హెచ్చరించారు. ఇతర గురువుల ఆశ్రయము వల్ల ఎన్ని ప్రయోజనములున్ననూ తనకు విశ్వాసమున్న గురువునే ధ్యానించవలెను. మనకు మరణమాసన్నము కాకముందే మనం బ్రహ్మజ్ఞానాన్ని (దర్శనం) పొందాలని, తద్వారా కేవలం అద్వైత సుఖాన్ని పొందగలమని, ఆ సుఖం సద్గురువు కృపారసము వలననే సాధ్యపడగలదని శ్రీసాయి నొక్కి వక్కాణించారు. మన దేశంలో ఉద్భవించిన షిర్డి సాయిబాబా భౌతిక శరీర రూపంలో ఉండగా గురుపూర్ణిమ మహోత్సవాన్ని ప్రారంభించి హెచ్.బి.సాఠేను ఆదేశిస్తూ ఇలా అన్నారు, **"ఈ రోజు గురుపూర్ణిమ అని మీకు తెలుసా? పూజాద్రవ్యాలు తీసుకొనివచ్చి పూజచేయండి."**

షిర్డీలో జరిగే గురుపూజోత్సవం నాడు భక్తులు శ్రీసాయిబాబా పాదపద్మాలను స్పృశించి, ఆరాధిస్తూ వారికి శాలువలను, ధనాన్ని, ఫలాలను, ధాన్యం వంటి పదార్థాలను కానుకలుగా సమర్పించేవారు. పరమపవిత్రమైన ఆ రోజున గురుపూజ చేసిన భక్తులు కూడా వారి కోరికలను, ప్రయోజనాలను నెరవేర్చుకొనేవారు.

# శ్రీలలితా సహస్రనామములు (అర్ధసహితము)

(గతసంచిక తరువాయి భాగం)- ***యల్లమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్



**123.“ఓం శారదారాధ్యాయై నమః” :** శ్రీసరస్వతి, వింజామరతో జగన్మాతను సేవించును.

**124.‘‘ఓం శర్వాణ్యై నమః’’ :** అష్టమూర్తులైన శివస్వరూపములందు పృధ్వీతత్వమైన పరమేశ్వరుని, శర్వుడు అంటారు. శర్వుని సతి శ్రీ శర్వాణికి నమస్కారము.

**125.“ఓం శర్మదాయిన్యై నమః” :** భక్తితో కొలిచిన వారికి ముక్తినొసగు ముక్తికాంత, సాధువులకు సాధ్యమై, తనసాన్నిధ్యమొసగు సాధ్వీమణి, బ్రాహ్మణులకు, వేదపండితులకు, వేదవేదాంగ కోవిదులకు, బ్రహ్మరూపము - తానై సాక్షాత్కరించుపరబ్రహ్మణి, బ్రహ్మవేత్తలకు, పరమయోగులకు, పరమహంసలకు బ్రహ్మపదమునొసగు, పరమకల్యాణి, శ్రీశర్మదాయినికి సాష్టాంగ నమస్కారము.

**126.“ఓం శాంకర్యై నమః” :** “శం” అనగా పరమసుఖమును “కర” నొసగు శ్రీశంకరుని సతీమణి శ్రీశాంకరి నామరూపములే లేని, ఈ నాతి, ఎన్నో నామరూపములతో తన భక్తుల ఆరాధనముచేయువానికి, అనుగ్రహించును. శంకర అర్ధనారీశ్వరూపిణి, శివశివానికి శిరసా, మనసా నమామి.



**127.“ఓం శ్రీకర్యైనమః” :** సర్వసంపదలకు నిలయమైన శ్రీకరి, తన భక్తులకు సర్వశుభములు, అష్టైశ్వర్యములు ప్రసాదించును. శ్రీమాతకు నమస్కారము.

**128.“ఓం సాధ్వ్యై నమః” :** ఈశ్వరుని పరిణయమాడ, మహాతపస్సుచేసి, సాధించిన సాధ్వీమణి. ఈశ్వరి, పార్వతి, జగదంబికకు నమస్కారము. స్మశానవాటిక స్థానము, విభూతి ధారణ, నాగాభరణములు పులిచర్మ ధారికి త్రినేత్రుడు అయిన పరమశివునిలో సకలమంగళప్రదమైన సర్వసౌభాగ్యాలు వున్నవని తల్లితండ్రులకు చెప్పి ఒప్పించి పెండ్లాడిన మహాసాధ్వి. తన మంగళ సూత్రముపై అపారమైన విశ్వాసముతో లోకకళ్యాణార్ధము, అమృతమధనంలో ప్రథమంగా ఆవిర్భవించిన కాలకూటవిషమును మ్రింగమని చెప్పిన పతివ్రతా శిరోమణికి సర్వమంగళకు శిరసానమామి.

**129.“ఓం శరశ్చంద్రనిభాననాయై నమః” :** శరత్కాల పౌర్ణమి, చంద్రబింబముతో సమానమైన చల్లని వెన్నెలవంటి కాంతిని ప్రసరించు చల్లని తల్లి మహాయోగేశ్వరుని ఇల్లాలు నిత్యము ప్రకాశవంతమైన చిరునవ్వుతో, సర్వజగత్తును ప్రసన్నంగా పరిపాలిస్తూ తన చంద్రబింబము వంటి ముఖారవిందంతో నిత్యము తన భక్తుల, బాహ్య, అంతరములందు శ్రీపరంజ్యోతియై వెలుగు శ్రీదేవికి నమస్కారము.

**130.“ఓం శాతోదర్యై నమః” :** అనేక గుహలతో వున్న హిమవత్పర్వతమును శాతోదరి అంటారు. అనగా పర్వతరాజపుత్రి శ్రీపార్వతీ దేవి సన్నని ఉదరము గల శుభలక్షణయు శ్రీశాతోదరికి నమస్కారము.

(సశేషం)

# దాసాను దాసుడు - హరిదాసుడు (నీతి కథ)

*- యం.నాగేంద్ర ప్రసాద్,* తిరుపతి

మౌజీకి చిన్నతనములోనే తల్లితండ్రులు గతించారు. ఆ గ్రామంలోని వారు ఎవరైనా దయతలచి పెట్టిన ఆహారం తింటూ, రాత్రులు దేవాలయంలోను, సత్రాలలోను, వీధి అరుగులమీదా పడుకునేవాడు. ఇలా పది సంవత్సరాలు గడిపోయాయి.

ఆ గ్రామములోని ధనికుడొకడు అన్న వస్త్రాలిచ్చి నెలకు రెండు రూపాయిల వేతనముతో మౌజీని తన పశువుల కాపరిగా నియమించాడు. మౌజీకి ఆ రోజు నుంచి అడవికి పశువులను తోలుకు వెళ్ళి మేపటం,ఆ ఇంట పెట్టిన ఆహారం తినటం, పశువుల కొట్టంలో నిద్రించటం దినచర్య అయిపోయింది.

ఒకరోజు యథా ప్రకారం పశువులను తోలుకొని అడవికి వెళ్ళాడు. పశువులు పచ్చికను మేస్తున్నాయి. మౌజీ సమీపంలోని నది ఒడ్డున వున్న చెట్టుక్రింద కూర్చుని పాటలు పాడుకోసాగాడు.

ఆ సమయంలో పండితు డొకడు ఆ మార్గం గుండా పోతూ ఆ చెట్టు వద్దకు వచ్చాడు. నదిలో స్నానం చేసి, తన వద్ద వున్న సంచిలోని పొడి బట్టలను ధరించి తడి బట్టలు ఆరవేసుకొని కాసేపు ధ్యానం చేశాడు. ధ్యానం చాలించి ఆరబెట్టిన బట్టలను సంచిలో పెట్టుకొని వెళ్ళిపోవటానికి సిద్ధమైనాడు.

అంత దాకా పండితుడి చర్యలు గమనిస్తున్న పశువులకాపరి మౌజీ పండితుణ్ణి సమీపించి, నమస్కరించి, "అయ్యా ! మీరెవరు? ఎక్కడనుంచి ఎక్కడకు వెళుతున్నారు? మీరింతవరకు కళ్ళు మూసుకుని ఏం చూశారు? కాస్త వివరంగా



చెప్పి నా సందేహాలు తీర్చండి" అంటూ వినయముగా అడిగాడు.

అందుకు ఆ పండితుడు మౌజీని తేరపార చూసి "భగవదనుగ్రహం కలుగుగాక" అంటూ ఆశీర్వదించాడు. అతడి వినయవిధేయతలకు సంతోషించాడు. తానొక పండితుడననీ, కేశపపురం నుంచి దౌలతాబాద్‌కు వెళుతున్నాననీ, అక్కడ తనకు శిష్యులు అనేకులున్నారనీ, తాను కళ్ళు మూసుకొని దేవుణ్ణి చూశానని చెప్పి ఆ పండితుడు తన దారిన వెళ్ళిపోయాడు.

పండితుడు వెళ్ళిపోయాక పశువుల కాపరి మౌజీకి దేవుణ్ణి చూడాలనే ఆశ కలిగింది. వెంటనే నది వద్దకు పరిగెత్తాడు.

కట్టుకున్న బట్టలు విడిచి గట్టున పడేశాడు. నదిలో స్నానం చేసి తిరిగి వచ్చాడు. ఒళ్ళు తుడుచుకొని, ఆ బట్టలనే ధరించాడు. కళ్ళు మూసుకుని చెట్టు నీడన కూర్చున్నాడు. అలా కూర్చోగానే దేవుడు కనిపిస్తాడని భావించిన మౌజీ నమ్మకం వమ్మయింది.

కళ్ళు, ముక్కు మూసుకోవడంలో లోపం జరిగిందేమోనని, ఈసారి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. చీకటి తప్ప అతడికి మరేదీ కనిపించలేదు. ఐనప్పటికీ దేవుణ్ణి చూడకుండా అక్కడనుంచి కదలనని పంతం పట్టి కూర్చున్నాడు. కాస్సేపటికి ఊపిరాడక ప్రాణం పోయే పరిస్థితి ఎదురైంది.

జగత్తు అంతటా సర్వాంతర్యామిగా వున్న భగవంతుడికి ఈ పశువుల కాపరి విషయం తెలియకపోతుందా? పండితుడు పలికిన మాటల్లో నిజమెంత ఉందో గ్రహించలేని అమాయకుడై, పట్టుదలతో కూర్చున్న మౌజీని కాపాడాలనే ఉద్దేశంతో పరుగెత్తుకొని అక్కడకొచ్చాడు. మౌజీ ముందు నిలబడి "బాలకా ! దైవదర్శనం కోసం పట్టుదలతో కూర్చున్న నీ కోర్కెను తీర్చటానికి వచ్చాను. కళ్ళు

తెరచి చూడు" అంటూ తన దివ్యహస్తాన్ని మౌజీ తలపై వుంచాడు.

వెంటనే మౌజీ కళ్ళు తెరచి తన ఎదుట సాక్షాత్కరించిన దివ్య మంగళ విగ్రహాన్ని చూశాడు. ఆశ్చర్యపోతూ, "ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"ఎవరిని దర్శించాలని కళ్ళు, ముక్కు మూసుకొని దీక్షతో కూర్చున్నావో ఆ భగవంతుణ్ణి నేనే"

"ఓహో ! భలే ! నీవు దేవుడవా? అందుకు ఆధారం ఏమిటి?"

చిరునవ్వుతో భగవంతుడు "నీకు ఏ విధంగా ఆధారం చూపించాలో చెప్పు. అదే విధంగా ఆధారం చూపిస్తాను" అన్నాడు.

అందుకు మౌజీ ఏదో జ్ఞాపకం రాగా యిలా అన్నాడు. " నువ్వు నన్ను మోసం చేయలేవు. ఇంతకు కాస్సేపటికి క్రితం ఒక పండితుడు దేవుణ్ణి చూశానని చెప్పి వెళ్ళాడు. ఆయన ఎంతో దూరం వెళ్ళి వుండడు. ఒక్క పరుగులో పోయి ఆయన్ను పిలుచుకొని వస్తాను. తాను చూసిన దేవుడు నువ్వేనని పండితుడు నిర్ధారిస్తేనే గాని నమ్మను. అంత దాక నీవు ఇక్కడనే వుండాలి."

భగవంతుడు అందుకు అంగీకరించాడు. కాని తాను తిరిగి వచ్చే దాకా భగవంతుడు వుండడేమోనని మౌజీకి అనుమానం వచ్చింది. వెంటనే అక్కడున్న తీగలతో భగవంతుణ్ణి ఒక చెట్టుకు గట్టిగా కట్టేసి పండితుడి కోసం పరిగెత్తాడు.

కొంత దూరం పరిగెత్తి మొత్తానికి పండితుడని చూడగలిగేడు. "స్వామి! కాస్త ఆగండి. మీరు వెళ్ళాక దేవుడు వచ్చాడు. అతడే దేవుడనే నమ్మకం కలుగక ఆయన్ను చెట్టుకు గట్టిగా కట్టేసి వస్తున్నాను. నాతో వచ్చి మీరు చూసిన భగవంతుడు ఆయనో కాదో తెలపండి!" అంటూ ఎలుగెత్తి పిలిచాడు.



తనను పిలుస్తూ పశువుల కాపరి రావటం పండితుడు చూశాడు. తన వద్దవున్న సంచిని తస్కరించడానికే ఏదో నెపంతో వస్తున్నాడని పండితుడు సందేహపడ్డాడు. ఆ ఆలోచన రాగానే పండితుడు పరిగెత్తడం ప్రారంభించాడు.

మౌజీ అంతకంటే వేగంగా పరిగెత్తి పండితుణ్ణి అందుకోగలిగాడు. పండితుడు తప్పించుకోటానికి ఎంత ప్రయత్నించినా వదలక ఉడుం పట్టు పట్టి భగవంతుణ్ణి కట్టివేసిన చెట్టువద్దకు తీసుకువెళ్ళాడు.

"స్వామీ ! ఆ చెట్టు కేసి చూడండి. భగవంతుణ్ణి చెట్టుకు కట్టివేశాను. మీరు ధ్యానంలో చూసిన దేవుడు ఆయనో కాదో చెప్పండి" అని అడిగాడు మౌజీ.

పండితుడి కళ్ళకు భగవంతుడు కనపడలేదు. చెట్టుకు చుట్టిన తీగలు మాత్రమే కనిపించాయి. నాలుగువైపులా పరకాయించి చూసి "భగవంతుడెక్కడ!" అని మౌజీని పండితుడు అడిగాడు.

పశువుల కాపరి నవ్వుతూ "ఏమిటి స్వామీ ! పగటివేళ తెల్లని ఆవులనే గుర్తించని మీరు అమావాస్య చీకటిలో నల్లని దున్నలను గుర్తించగలరా? కళ్ళ ఎదుటే వున్న భగవంతుడే కనిపించటం లేదా? ఆదిగో చూడండి. ఆ చెట్టుకు తీగలతో కట్టివేశాను. మీరు చూసిన భగవంతుడు ఆయనో కాదో తేల్చి మీ దారిన మీరు వెళ్ళండి" అన్నాడు.

పండితుడు మౌజీని త్వరగా వదిలించుకొని వెళ్ళిపోవాలనే ఉద్దేశంతో, అతడికి భగవంతుడు కనిపించకపోయినా చెట్టుకు కట్టివేయబడ్డ భగవంతుడినే తాను చూశానని బొంకి, తన దారిన వెళ్ళిపోయాడు.

పండితుడు వెళ్ళిపోగానే, పశువుల కాపరి మౌజీ చెట్టువద్దకు వెళ్ళి భగవంతుడి కట్లు విప్పి సాష్టాంగ నమస్కారము చేశాడు.

అప్పుడు భగవంతుడు యిలా అన్నాడు. "బాలకా ! నన్ను పూర్తిగా నమ్మినందుకు నీకు నిదర్శనం యిచ్చాను. ఆ పండితుడు భక్తుడు కాదు. నా పట్ల పరిపూర్ణ విశ్వాసం లేనివాడు. అతగానికి నే నెప్పుడూ కనిపించలేదు. ధ్యానంలో నన్ను చూశానని అబద్ధం చెప్పాడు. ఇప్పుడు కూడా నీకు మాత్రమే కనిపించాను. ఆ పండితుడికి కనిపించలేదు. చెట్టుకు కట్టివేయబడిన నన్ను చూశానని చెప్పటం కూడా అబద్ధమే. అతడు పచ్చి మోసగాడు. నీవు నన్ను చూశావు. నా దర్శనం చేసుకొన్న వారిని ఉత్తచేతులతో పంపను. కాబట్టి నీకు ఏం వరం కావాలో కోరుకో, యిస్తాను."

"దేవా ! ధన్యుణ్ణి! నేను స్నానం చేసి ధ్యానంలో కూర్చోగానే మీరు కనబడాలని కోరుకుంటున్నాను అనుగ్రహించండి. మీరు మోసగాడని చెప్పిన పండితుడి మూలంగానే నాకు భగవంతుణ్ణి చూడాలనే కోరిక కలిగింది. పట్టుదలతో కూర్చుని మీ దర్శనం చేసుకోగలిగాను. అందుచేత ఆ పండితుణ్ణి గురువుగా భావిస్తున్నాను. ఆయనకు కూడ మీ దర్శన భాగ్యం కలిగించండి. ఇంతకంటే నాకు ఏ కోరికా లేదు" అన్నాడు వినయంగా మౌజీ.

భగవంతుడు ఆ బాలుడి కోర్కెలు విన్నాడు. చిరునవ్వుతో "వత్సా! మౌజీ! నీ ఉన్నత భావాలను మెచ్చుకున్నాను. లోకంలో గురువు వల్ల శిష్యుడు తరించటం చూస్తున్నాం. అందుకు భిన్నంగా నీ వల్ల నీ గురువు తరించాడు. అతడికి నా పట్ల భక్తి శ్రద్ధలు లేకున్నప్పటికీ నీ కోర్కె ప్రకారంగా సద్గతిని ప్రసాదిస్తున్నాను. మీరిద్దరూ కలిసి లోకంలో భక్తిమార్గం ప్రచారం చేసి పాపులను పునీతులుగా మార్చి



జీవితాంతాన పుణ్యలోకంలో శాశ్వతంగా నివాసం చేయండి" అని చెప్పి అంతర్ధానమైనాడు. అక్కడ దౌలతాబాద్‌లో పండితుడు ఒక రోజు ధ్యానంలో కూర్చున్నాడు. భగవంతుడి దివ్యమంగళ విగ్రహం కనులారా గాంచాడు. బ్రహ్మానందం అనుభవించాడు. తనకు భగవద్దర్శనం కలగటానికి కారణభూతుడు పశువుల కాపరి మౌజీయే అని భగవంతుడి వలన తెలుసుకొని ఆ పిల్లవాణ్ణి కలుసుకొనే నిమిత్తం బయలుదేరాడు.

కొద్దిరోజులలోనే గురుశిష్యులు కలుసుకున్నారు. పరస్పరం నమస్కరించుకున్నారు. గౌరవించుకున్నారు. నువ్వు గురువుంటే నువ్వే గురువనీ, భగవంతుడి దర్శనం నీ మూలంగానే కలిగిందని కాస్సేపు వాదించుకున్నారు. చివరకు వారిద్దరూ కలిసి భక్తిగీతాలు గానం చేస్తూ లోకంలో దైవభక్తిని ప్రచారం చేయటానికి కంకణం కట్టుకున్నారు. వెంటనే సన్యాసి ఉడుపులు ధరించారు. పండితుడు తన పేరును 'దాసానదాసు'డనీ మౌజీ తన పేరును 'హరిదాసు'అని మార్చుకున్నారు.


హరిదాసు తంబూర మీటుతూ పాడేవాడు. దాసానదాసుడు తాళం వేస్తూ పాడేవాడు. వారి పాటలకు శిలలు కరిగిపోయాయి. కఠిన హృదయాలు మైనం ముద్దలయ్యాయి. భక్తులు పరవశించారు. జనసామాన్యం కూడా భగవంతుణ్ణి చేరుకునే మార్గం తెలుసుకున్నారు. ఆ గురుశిష్యులు ధన్యజీవులైనారు. (భక్తి కథల నుండి)



# ప్రార్థనా కుసుమాలు

సేకరణ : సాయి శరణ్ తల్లంరాజు శేషగిరిరావు, హబ్సిగూడ, హైద్రాబాద్ – 500 007, ఫోన్ : 27170338

ఈ క్రింది మంత్రములను, శ్లోకములను నిష్ఠతో రోజూ 11సార్లు పఠించిన మనః శాంతి పొందగలరు.



మహామంత్రాలు

1. ఓం గం గణపతయే నమః
2. ఓం హం హనుమతే నమః

శివపంచాక్షరీ సోత్రం

3. ఓం నమః శివాయ

రామ మంత్రం

4. ఓం శ్రీరామ జయ రామ జయ జయ రామ

సాయినామమంత్రం

5. ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి
6. సాయి శివ హరి ఓం

అష్టాక్షరీ మంత్రం

7. ఓం నమో నారాయణాయ

ద్వాదశాక్షరి మంత్రం

8. ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ వేంకటేశ్వర జప మంత్రం

9. ఓం శ్రీ వేంకటేశాయ నమః
10. ఓం నమో వేంకటేశాయ

భాస్కర మంత్రం

11. ఓం నమో భాస్కరాయ

శ్రీ ఆంజనేయ మంత్రం

12. ఓం నమో భగవతే వాయుపుత్రాయ

గాయత్రీ మంత్రం

13. ఓం భూర్భువఃసువః । తత్స వితుర్వరేణ్యం ।
భర్గో దేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్ ॥



మృత్యుంజయ మంత్రం

14. ఓం త్రయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్
ఊర్వారుక మివ బంధనాత్ మృత్యో ర్ముక్షీయ మామృతాత్

షోడశనామ మంత్రం

15. హరే రామ హరే రామ రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే

శ్రీ లక్ష్మీనృసింహ మంత్రం

16. ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలతంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం మృత్యు మృత్యు నమామ్యహం

నవగ్రహ స్తోత్రం

17. ఆదిత్యాయ సోమాయ మంగళాయ బుధాయచ
గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః

రామనామమంత్రం

18. శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

శివనామస్మరణ

19. 1. శివాయ నమః 2. రుద్రాయ నమః 3. మహేశ్వరాయ నమః 4. విష్ణవే నమః 5. పితాయ నమః 6. సంసార భిషజే నమః 7. సర్వజ్ఞాయ నమః 8. పరమాత్మాయ నమః

సాయినాథ సోత్రం

20. ప్రథమం సాయినాథాయ ద్వితీయం ద్వారకామాయినే
తృతీయం తీర్థరాజాయ చతుర్థం భక్తవత్సలే
పంచమం పరమాత్మాయ షష్టంచ షిర్డీవాసినే
సప్తమం సద్గురునాథాయ అష్టమం అనాథ నాథనే
నవమం నిరాడంబరాయ దశమం దత్తావతారవే
ఏతాని దశనామాని త్రిసంధ్యః పఠేన్నరః
సర్వకష్ట భయన్ముక్తా సాయినాథ గురుకృపా

20. శ్రీపాదవల్లభ మంత్రం

శ్రీ పాదవల్లభ దిగంబరా దత్త దిగంబరా

## ఆధ్యాత్మిక సంపద

భగవంతుడిని చేరడానికి మన శరీరంలోని అయిదు ఆవరణలు అనే అడ్డంకులు తొలగాలి. అవే అన్నమయకోశము, మనోమయకోశము, ప్రాణమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము.

**1. అన్నమయ కోశం :** అన్నము అంటే ఆహారం, మనం తినే ఆహరంలోని లోపాలవల్ల, త్రాగే నీటి కాలుష్యంవల్ల, శరీరానికి అనేక రకాలైన జబ్బులు వస్తున్నాయి.

మన మనస్సును ఆరోగ్యంగా ఉంచడానికి దానిపోషణకు అన్నం కావాలి. నీతి బాహ్యమైన పనులద్వారా సంపాదించిన డబ్బుతో వచ్చిన ఆహారం మనస్సును చెడును చేస్తుంది. శరీరం జబ్బు పడుతుంది. దుఃఖం కలుగుతుంది. కష్టాలు వస్తాయి.

**2. మనోమయ కోశం :** మనస్సును శుభ్ర పరచుకోవడానికి ఆధ్యాత్మిక పరిశ్రమ కావాలి. మన శరీరం, దుస్తులు, మన గృహం ఎలా శుభ్రంగా వుంచుతామో, అలాగే మనస్సు కూడా శుభ్రంగా ఉండాలి.

పూజ, స్వాధ్యాయం (వేదాలను, ఉపనిషత్తులను చదవటం), సత్సంగం (మంచి ఆధ్యాత్మిక చింతన ఉన్నవారి దగ్గర జేరి, ఆధ్యాత్మిక చర్చలు చేయడం) ధ్యానం, మననం (మంచి విషయాలను గుర్తుకు తెచ్చుకోవడం) అనే వాటి ద్వారా మనస్సు శుభ్రపడుతుంది.

**3. ప్రాణమయకోశం :** ప్రాణశక్తిని ప్రాణాయామం ద్వారా స్వాధీనపరచుకోవచ్చు. ప్రాణాయామ ప్రక్రియ ద్వారా అనేక సంవత్సరాలు అన్నం, నీరు లేకుండా జీవించవచ్చు.

మన మనస్సు శక్తివంతంగా ఉన్నప్పుడే మన నిర్ణయాత్మక శక్తి బలపడగలదు.

**4. విజ్ఞానమయ కోశం :** ఆత్మకు శరీరం ఒక వాహనం లాంటిది. మన ఆవేశాలనూ, భావాలనూ శుభ్రంగా ఉంచుకుంటే విజ్ఞానమయ కోశం ఉత్తేజిత



మవుతుంది. ఆత్మను ఆవరించుకొని ఉన్న కాలుష్యాన్ని శుభ్రం కావించుకోగల్గాలి. కొన్ని బంధ ముద్రల ద్వారా, కొన్ని ఆధ్యాత్మిక ప్రక్రియల ద్వారా విజ్ఞానమయ కోశాన్ని ఉత్తేజపరచాలి.

**5. ఆనందమయకోశం** : తీవ్రమైన ధ్యానం ద్వారా, నాదయోగం ద్వారా, బిందు యోగం ద్వారా ఆనందమయకోశాన్ని ఉత్తేజపరచుకోవచ్చు. అందువల్ల ప్రతి ప్రాణిపై అపారమైన ప్రేమ కలుగుతుంది. ప్రేమించడం ద్వారానే భగవంతుని రప్పించుకోగలం. మనవాడిగా చేసుకోగలం.

ఫలాపేక్ష లేనివానిగా నుండి భక్తిశ్రద్ధలతో భగవంతుని సేవించవలయును. భగవంతుని మనము ఏ రూపముగా తలచుచున్నామో అదే రూపముగా దర్శనమిచ్చును. సకల వస్తువులయందు భగవంతుడున్నాడని విశేష భక్తితో దలచువానికి నిజమైన భక్తి కలుగును.

ఆశ యనునది పిశాచము వంటిది కనుక, సకల ఆశలను వదిలివేయవలెను.

అబద్ధము చెప్పుట, లేని విషయములను కల్పించి చెప్పుట, దూషించుట, వృధాగా మాట్లాడుట – ఈ నాలుగు పాపకార్యములును నాలుక వల్ల నాలుగు కార్యములుగా నున్నవి.

అనేక జన్మములుగా చేయుచు వచ్చిన సత్కర్మాచరణము వలన గాంచిన సుకృతముచే మానవజన్మ వచ్చుచున్నది. ఇట్టి మానవజన్మము వలన మోక్షమును పొందవలెను.

ఒక మహాత్ముడైన గురువు యొక్క కృపలేకపోతే మనస్సు శుద్ధం కాదు; భగవత్ప్రాప్తి కలుగజాలదు.

నాలుక పవిత్రం కావాలంటే భగవన్నామాన్ని పలకాలి.

అభిమానమే సర్వదుఃఖాలకు మూలం. నిరభిమానమే సర్వసుఖాలకు నిలయం.



# ధ్యానం

**దువ్వూరి ప్రసాదరావు**

**మ**నసును శుద్ధిచేయడానికే ధ్యానం అవసరము. ధ్యానము వల్ల బుద్ధి ప్రసారం ఏర్పడుతుంది. పరమాత్మపై మనసు ఏకాగ్రంగా ఉంచటానికే ధ్యానం అవసరము. ధ్యానం అనే సాధన ద్వారా భగవంతుని దర్శించవచ్చు. మన మనసు భగవంతుడిపైనే ఉన్నట్లయితే, మనం భగవంతుడికి దగ్గరవుతాం.

సర్వశరీరాల్లోగల చైతన్యాన్ని ఏకాగ్రమనస్సుతో చింతించుటయే ధ్యానం.

శ్రవణ మననాలచేత నిశ్చయబుద్ధితో పరమాత్మపై ఏకాగ్రంగా మనస్సును నిలిపి ఉండడమే నిధిధ్యాసనం లేదా ధ్యానం అంటారు. మనసు నుంచి రాగాదులను తొలగించుటయే ధ్యానం.

శబ్దాది విషయాలనుంచి శ్రోత్రాది ఇంద్రియాలనే కరణాల్ని తొలగించి మనసుతో నిరోధించి, ఏకాగ్ర భావంతో చింతన చేస్తూ ఉండడమే ధ్యానం.

తైలధారలాగ నిరంతర అవిచ్ఛిన్న భావంతో పరమాత్మను చింతన చేయుటయే ధ్యానం.

ఆత్మ స్వరూపాన్ని చింతించడమే ధ్యానం.

ప్రతిరోజు ఉదయం ధ్యానం చేసినచో నీవు చేసే పనులూ నీ ధ్యానాన్ని ప్రభావితం చేస్తాయి.



ధ్యానానికి పూర్వాంగాలు పూజ, స్తుతి, జపం.

ధ్యానానికి భక్తి, శ్రద్ధ కావాలి. పరమాత్మను ఏ రూపంలోనైనా, లేదా రూపరహితంగానైనా ధ్యానించవచ్చు.

నేలపై కూర్చుని ధ్యానిస్తే మనలో ఉండే ప్రాణశక్తిని భూమ్యాకర్షణశక్తి లాగేస్తుంది. అందువల్ల నేలపై మడతలు పెట్టిన వస్త్రము వేసుకుని ఆసనాన్ని అమర్చుకొని కూర్చుని ధ్యానం చేయాలి.

ధ్యానానికి ప్రత్యేక సమయాలు లేవు. అయితే సంధ్యాకాలాలు ముఖ్యంగా ఉదయం 4 – 5 గంటల సమయం శ్రేష్ఠం. ఆ కాలములో మనస్సు ప్రశాంతంగాను, పరిశుద్ధంగాను ఉంటుంది. సంధ్యాకాలంలో మనస్సు ఏకాగ్రత చెందటానికి సహజముగా అనుకూలం.

ధ్యానం చేసే గదిని పరిశుభ్రంగా ఉంచాలి. ఉపాసనా మూర్తి లేదా స్ఫూర్తిదాయకులైన వారి పటాలతో సుందరంగా ఆ గదిని అలంకరించాలి. అటువంటి గది కాలక్రమేణ శక్తితరంగాలతోను, ఆధ్యాత్మిక ప్రకంపనలతో నిండి వుంటుంది. ఆ గదిలోనికి వచ్చిన వారిని ఆ దివ్యశక్తి తరంగాలు ఆకర్షించి, శాంతి ఆనందాలను వారికి పంచుతాయి.

శరీరాన్ని ముఖ్యంగా వెన్నెముక, మెడ తిన్నగా ఉండాలి. చేతులను ఒడిలో ఉంచాలి. దృష్టిని భ్రూమధ్యంపైగాని, హృదయస్థానంపై గాని నిలపాలి. ప్రాణాయామాన్ని క్రమంగా చేస్తే, ప్రాణక్రియ స్వాధీనమవుతుంది. చిత్తాన్ని శ్వాసపైన గాని, ఇష్టదైవం యొక్క రూపంపై గాని, నిర్గుణంపై గాని కేంద్రీకరించాలి.

ఇంద్రియ మనోవృత్తుల్ని బయటకు పోకుండా అరికట్టి, వాటిని

అంతర్ముఖం చేసి, మనస్సును దైవధ్యానంలో ఏకాగ్రపరచాలి. మనసులో భగవంతుడు మాత్రమే కావాలనే కోరికతప్ప మరే కోరికలు ఉండకూడదు.

నేను చేయవలసిన పనులు చాలా మిగిలిపోయాయి. అందుకే ధ్యానం త్వరగా ముగించాలి అనే వ్యాపార సరళిభావాలు నీలో తలెత్త కూడదు.


ధ్యానయోగి ఎక్కువ తినకూడదు. అసలే తినకుండా ఉండకూడదు. కడుపులో సగం స్థలం అన్నానికీ, అందులో సగం స్థలం నీళ్ళకీ, తక్కిన సగం స్థలం వాయుసంచారానికీ ఉపయోగించాలి. అలాగే నిద్ర కూడా మోతాదుగానే ఉండాలి. కోరికల్ని వదలాలి. ధరించడానికి సాధారణమైన బట్టలు చాలు. ఆకలి తీరడానికి ఏ సాత్త్వికాహారాన్నైనా తినవచ్చు.

మరికొందరు దేహాన్ని శుభ్రపరచడం కోసం సుగంధ ద్రవ్యాలు వాడతారు. ఇవి వాడటం కూడా అడ్డంకే. ఎందుకంటే మనస్సు వీటిపై ప్రచురిస్తుంది. □

| | | |
|---|---|---|
| గురుస్వరూపమున జ్ఞానము ప్రధానమైనటువంటిది. అజ్ఞానమును తొలగించుటయే గురుతత్త్వము. కలియుగమున దత్తాత్రేయుల యొక్క మొట్టమొదటి పంచావతారములుగా పెద్దలు చెప్పినవి | | |
| **శ్రీపాదశ్రీవల్లభ** | **-** | **పిఠాపురం,** |
| **శ్రీ నృసింహసరస్వతి** | **-** | **కారంజ,** |
| **శ్రీ స్వామి సమర్థ** | **-** | **అక్కల్‌కోట్,** |
| **శ్రీ మాణిక్య ప్రభువు** | **-** | **మాణిక్యనగర్,** |
| **శ్రీ సాయిబాబా** | **-** | **షిరిడీ.** |



# ఊథిమహిమ



**ఈ** ప్రపంచం కట్టెల మాదిరిగా బూడిద అవుతుంది. అందరూ కూడ ఈ బూడిద స్థితికే చేరుతారు. బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య. బంధువులు ఎవరూ కారు. నగ్నంగా వచ్చాము. నగ్నంగానే పోతాం. వైరాగ్యం, వివేకం రావడానికే ఈ విభూతి. "రమించే రాముడు వచ్చాడు. సంచుల కొలది విభూతి తెచ్చాడు." అని బాబా పాడేవారని శ్రీసాయి సచ్ఛరిత్రలో ఉంది.

మరికొంత లోతుగా ఆలోచిస్తే మానవజీవితం కూడ విభూతి లాంటిదే. ఈ ప్రపంచం ఏదో ఒకనాడు విభూతిలాగా మారిపోతుంది. వివేకవంతుడిగా జీవించడం నేర్చుకోవాలి. కుటుంబాన్ని వివేకంతో పోషించుకుంటూ, వైరాగ్యం అలవరచుకోవాలి. బాబా బంగారు నాణాలను, ఊధిని భక్తులకు పంచిపెట్టి రెండూ ఒకటేనని నిరూపించారు. జీవితానికి పనికివచ్చే వివేకం, వైరాగ్యం కలిగివుండాలి.

"విభూతి చెంతన ఉన్న చాలును. క్రిమికీటకాదులు, విషప్రయోగాలు, దుష్టశక్తుల గాలులు మనకు తాకవు. వాటినుండి రక్షించబడడం సద్గురువు నుంచి పొందిన విభూతి మహత్మ్యమే. విభూతి ఐశ్వర్యమునకు హేతువు.

శరీరానికి, మనసుకు ఒక ఔషధం లాగా పనిచేస్తుంది. ఆత్మజ్ఞానాన్ని అందిస్తుంది. సర్వరోగనివారిణి, సర్వసంపదకారిణి, సర్వసుఖప్రదాయి, సర్వశక్తి ప్రదాయిని, సర్వ శత్రువినాశిని, సర్వసౌఖ్య సంతానకారిణి, సర్వమోక్షప్రదాయిని.

ఈలాంటి పరమపవిత్రమైన ఊధిని అందరూ క్రింది శ్లోకం పఠిస్తూ విభూతి ధారణ చేయాలి.

**పరమం పవిత్రం శిరిడిసాయిబాబా విభూతిం**
**పరమం విచిత్రం లీలా విభూతిం**
**పరమార్థ ఇష్టార్థ మోక్ష ప్రదాతం**
**షిరిడి సాయిబాబా విభూతిం ఇదమాశ్రయామి**

– **సేకరణ : కె.ఆర్. విజయ్‌కుమార్,** మదనపల్లి–517 325

## బాబా సూక్తులు-ప్రబోధనలు

1. **నా యందెవరికి దృష్టియో వారియందే నా కటాక్షము**
2. **నా భక్తులు నన్నెట్లు భావింతురో నేను వారి నా విధముగనే అనుగ్రహ హింతును.**
3. **ఎవరయితే సకల జీవకోటిలో నన్ను జూడగలుగుదురో వారే నా ప్రియభక్తులు.**
4. **నా కధలు వినినచో సకల రోగములు నివారింపబడును.**
5. **నా లీలలు వినువారికి శాంతి కలుగును.**
6. **నా యందు భక్తితో మీ చేతులు చాపినచో వెంటనే రాత్రింబవళ్ళు మీ చెంతనే నుండెదను.**





## లేఖలు

పోయిన సంవత్సరం మీరు మదనపల్లిలో గల హరిణి కాంప్లెక్సుకు వచ్చినప్పుడు శ్రీదేవిగారి ఇంట మీ దర్శనము చేసుకున్నాను. కంటిచూపు గురించి మీకు చెప్పగా మీరు హైద్రాబాద్ వెళ్ళిన తరువాత సాయి మందిరములో పూజచేసి ఐ విషన్‌ను నా కొరకు శ్రీదేవి ఇంటికి పంపినారు. అది వాడుచున్నాను. చాలా ఫలితము కనబడినది. నేను వేరే ఊరికి వెళ్ళినందున మీకు ఈ విషయము తెలియపరచలేకపోయినాను.

– **జె.యస్. నాగమణి,** రిటైర్డ్ తెలుగు పండిట్, ప్లాటు నెం.1087,
11వ వీధి, పుంపుహర్ నగర్, కొలతూరు, చెన్నాయ్ – 99.

విశ్వమంతా సృష్టించి ఆ విశ్వమంతా విస్తరించిన భగవంతుడిని చూడాలంటే మనిషికున్న రెండు చిన్ని కన్నులకు తాను కనిపించలేనేమోనని కరుణించి, మనిషి ఆలోచనా శక్తి స్థాయి ననుసరించి ప్రతిజీవిలోను ప్రతీ అణువులోను తానైవుండి భక్త జనోద్ధరణ కుపక్రమించిన స్వామీలీలలనెన్నో మేనెలలోని సాయిదర్శన్ మాసపత్రిక నందు లేఖలు చూసి నాకు రావూజీగారితో ఫోన్‌లో మాట్లాడాలనిపించింది. అది మధ్యాహ్న సమయము. నిరంతరం సాయి, సాయి భక్తుల సేవలో నిమగ్నమైన రావూజీగారు విశ్రాంతిలో వుండవచ్చని తలచి ఆ ప్రయత్నం విరమించాను. ఒకే తీవ్రమైన సంకల్పం వారితో మాట్లాడాలని. ఆ... ఆలోచనతోనే కునుకుతీశాను. ఓ బ్రహ్మాండమైన స్వప్నం ! చుట్టూ గ్లాస్ ఫిట్టింగ్‌తో వున్న ఓ ఏ.సి. ఛాంబర్‌లో పట్టు పీతాంబరాలు, మెడ నిండా రుద్రాక్షదండలు ధరించి తెల్లని గడ్డంతో వీల్ చైర్లో తిరుగుతూ ఓ నలుగురితో రావూజీగారు మాట్లాడుచున్నారు. చాంబర్‌లోనివారు బైటకు వచ్చేవరకూ బైటనే వేచి చూస్తూన్నాము. ఎంతసేపటికీ చాంబర్ ఖాళీకాలేదు. నిదానంగా నా కల

చెదిరింది, వెంటనే హైద్రాబాద్‌లో వున్న మా ఆధ్యాత్మిక మిత్రులు శ్రీమతి రేవతీ ప్రసాద్‌గారికి ఫోన్‌చేసి రావూజీగారి గురించి అడిగాను. హైద్రాబాద్ వచ్చేయండి వారివద్దకు వెళదామన్నారు. ఒకటి రెండు రోజుల్లో మా కుటుంబ సమేతంగా బయలుదేరి మిత్రులను కలుపుకుని దమ్మాయిగూడలో వున్న సాయిదర్శన్ రావూజీగారి వద్దకు వెళ్ళాము. అంత ఆశ్చర్యం ! నాకు స్వప్నంలో అనుభవమైనట్లుగా గ్లాస్‌ఫిట్టింగ్, ఏసీ, పట్టు పీతాంబరాలు, రుద్రాక్షలు, తెల్లగడ్డం, వీల్ చైర్ ఏమీ లేవు ! అంతే కాదు. వారి ఒంటిపై లుంగీ, బనీను తప్ప మరేమీ లేవు. ఇంటినిండా బాబా ఫోటోలు. ఎక్కడనుంచో చిన్నగా సాయినామం విన్పిస్తోంది. సాయిదర్శన్ రావూజీగారి గురించి మా స్వప్న అంచనాలు తారుమారయ్యాయి. వారిలో ఎంతో నిరాడంబరత ప్రతీ కదలికలో సాయితత్వం. వారు మాకు తెలుగు సాయిగా అనిపించి వెంటనే పాదదర్శనం తీసుకున్నాము. ఊదీ ప్రసాదము ఇచ్చారు. శిరస్సుపై చేయివుంచి ఆశీర్వదించారు. ఆ ఆశీర్వాదం నుంచి ఓ విద్యుత్ ప్రవాహం శరీరమంతా నిండినది. ఓ అనిర్వచనీయమైన అనుభూతికి గురయ్యాము. ఆ రోజంతా ప్రయాణంలో అలసట చెంది తీవ్ర తలభారంతో వున్న నా శ్రీమతి శ్రీలక్ష్మిని కూడా ఆశీర్వదించారు. ఆమెకు వెంటనే శిరోబాధ నివృత్తి జరిగింది! రావూజీగారిని ఫోన్‌లో పలకరించాలన్న సంకల్పం వారి దర్శన భాగ్యాన్ని కలిగించినందులకు ఎంతో సంతోషపడ్డాము. సాయితత్వం సాయి సేవలో పూర్తిగా నిమగ్నమైన రావూజీగారి దర్శనం ద్వారా సాక్షాత్తు ఆ సాయినాథుడ్ని దర్శించిన అనుభూతిని పొందాము.

– **టి.అరవిందరాజు,** మండలం : గుంటూరు జిల్లా,

ఫోన్ : 08645–243668

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**